# జర్నలిస్ట్ డైరీ

తెలుగు దినపత్రిక





సంపుటి :12 సంచిక :340 గురువారం 13-8-2026 పేజీలు:8 వెల:3 https://www.epaperjournalistdiary.com/


## పాక్ ఆర్మీ మారణకాండ.




- బలూచిస్తాన్‌పై అర్ధరాత్రి వైమానిక దాడులు..
- 28 మంది పౌరులు మృతి.. 17 మందికి గాయాలు
- మృతుల్లో 9 మంది చిన్నారులు, ఏడుగురు మహిళలు
- శిథిలాల కింద మరికొందరు చిక్కుకున్నట్లు అనుమానం
- ఘటనపై స్పందించని పాక్ మిలిటరీ
- బలూచ్ ఉద్యమాన్ని అణచివేస్తున్న పాక్ ప్రభుత్వం
- మిస్సైల్స్, డ్రోన్లతో దాడులు చేస్తున్నట్లు ఆరోపణలు
- గతంలోనూ పౌరులపై పాక్ ఆర్మీ దాడులు

02

### పాన్ మసాలా, గుట్కాపై ఏడాదిపాటు

## నిషేధం విధించిన కర్ణాటక



- పొగాకు, నికోటిన్ ఉత్పత్తులపై సర్కార్ కొరడా
- ఆగస్టు 10 నుంచి నిషేధం అమలు
- అమ్మకాలు, రవాణా, పంపిణీపైనా ఆంక్షలు
- తయారీ సంస్థలపై అధికారుల ప్రత్యేక నిఘా
- తనిఖీలు, నోటీసులు.. జరిమానాలకు రంగం సిద్ధం
- ప్రజల ఆరోగ్యం దృష్ట్యా కీలక నిర్ణయం
- నిషేధిత ఉత్పత్తులపై సమాచారం ఇవ్వాలని సూచన
- పాన్ మసాలా ప్యాకేజింగ్‌పైనా కఠిన నిబంధనలు
- ప్లాస్టిక్, సింథటిక్ పాలిమర్ల వినియోగానికి నో
- అల్యూమినియం ఫాయిల్, మెటలైజ్డ్ లేయర్లపైనా ఆంక్షలు

02




## కేటీఆర్ అసత్య ప్రచారాన్ని మానుకోవాలి

- కేసీఆర్ ఫామ్‌హౌస్‌లో పండిన వరికి వచ్చిన ధరను తెలంగాణ రైతులకు చెప్పాలి
- భూకేటాయింపులు నిబంధనల మేరకే జరిగాయి
- హైటెక్ పాలసీతో హైదరాబాద్‌కు మేలు
- మంత్రి శ్రీధర్‌బాబు

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అసత్య ప్రచారంతో ప్రజలను పక్కదోవ పట్టిస్తున్నారని మంత్రి శ్రీధర్‌బాబు విమర్శించారు. కేసీఆర్ ఫామ్‌హౌస్‌లో పండిన వరికి వచ్చిన ధర ఎంతనేది కూడా తెలంగాణ రైతులకు కేటీఆర్ చెప్పాలని అన్నారు. తాము కోటీన్నర రూపాయలకు ఇచ్చిన భూమిని బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.90 లక్షలకే ఇచ్చిందని, భూకేటాయింపులు నిబంధనల ప్రకారమే జరిగాయని స్పష్టం చేశారు. ఐదు ఎకరాల భూమిని రూ.7.5 కోట్లకే ఇచ్చామని, కేటీఆర్ చెబుతున్న రూ.200 కోట్లు ఎక్కడి నుంచి వచ్చాయో వెల్లడించాలని డిమాండ్ చేశారు. హైటెక్ పాలసీతో హైదరాబాద్ ప్రజలకు మేలు జరుగుతుందని,

-మిగతా 2 లో



## వయసొచ్చిన పిల్లలు తల్లిదండ్రుల ఆస్తి కాదు..

- బాంబే హైకోర్టు కీలక వ్యాఖ్యలు
- తమ జీవితంపై నిర్ణయం తీసుకునే హక్కు వారికే: హైకోర్టు
- తనకు నచ్చిన వ్యక్తితో జీవించే హక్కు యువతికి ఉంది
- కుమార్తెను అప్పగించాలంటూ తల్లి హెబియస్ కార్పస్ పిటిషన్
- 17 ఏళ్ల వయసులో ఇంటి నుంచి వెళ్లిన యువతి
- పోలీసులు గుర్తించి తల్లికి అప్పగించినా.. మళ్లీ వెళ్లిపోయిన యువతి
- తన ఇష్టప్రకారమే అతనితో ఉంటున్నానని కోర్టుకు వెల్లడి
- యువతి నిర్ణయాన్ని గౌరవించిన నాగ్‌పూర్ బెంచ్
- అక్రమ నిర్బంధం రుజువు కాలేదన్న న్యాయస్థానం
- తల్లి దాఖలు చేసిన పిటిషన్‌ను కొట్టివేసిన బాంబే హైకోర్టు

న్యూఢిల్లీ

: వయసొచ్చిన పిల్లలు తల్లిదండ్రుల ఆస్తి కాదని, వారు తమ జీవితంపై నిర్ణయం తీసుకునేందుకు పూర్తి స్వేచ్ఛ ఉన్న స్వతంత్రులని బాంబే హైకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. తనకు నచ్చిన వ్యక్తితో జీవించేందుకు వెళ్లిన కుమార్తెను తమకు అప్పగించాలంటూ ఓ తల్లి దాఖలు చేసిన పిటిషన్ ను కోర్టు కొట్టివేసింది. మేజర్ అయిన యువతి తన జీవిత భాగస్వామిని ఎంచుకునే హక్కును కలిగి ఉంటుందని కోర్టు సమర్థించింది.నాగ్‌పూర్‌కు చెందిన ఓ యువతి 17 ఏళ్ల వయసులో ట్యూషన్‌కు అని చెప్పి ఇంటి నుంచి

-మిగతా 2 లో

# మిల్లర్లను వదలొద్దు!

### మిల్లర్ల నుంచి బకాయిలు వసూలు చేయాల్సిందే

- బకాయిల వసూలుకు విధివిధానాల రూపకల్పన
- ధాన్యం నిల్వకు ఐదు నియోజకవర్గాల్లో సైలో బ్యాగ్ నిర్మాణాలూ
- మొండి బకాయిదారులుగా మారిన మిల్లర్లకు కేటాయించే ధాన్యాన్ని మహిళా సంఘాలకు కేటాయిస్తాం
- మిల్లింగ్ బాధ్యతలను మహిళా సంఘాలకు అప్పగిస్తాము
- పౌరసరఫరాల సమీక్షలో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి

హైదరాబాద్,ఆగస్ట్ 12 (జర్నలిస్ట్ డైరీ) : మిల్లర్లు బకాయిపడిన ధాన్యం విలువకు సంబంధించిన మొత్తాన్ని వసూలు చేయాల్సిందేనని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. వ్యాపార దృక్పథంతో మిల్లులు నడిపే వారితో సానుకూలంగా ఉంటామని, ఉద్దేశపూర్వకంగా ఎగవేతలకు ప్రయత్నించే వారితో కఠినంగా వ్యవహరిస్తామని సీఎం హెచ్చరించారు. పౌరసరఫరాల శాఖపై ఆ శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డితో కలిసి సీఎం రేవంత్ రెడ్డి ఎంసీఆర్ హెచ్ ఆర్డీలో బుధవారం సమీక్ష నిర్వహించారు. గత ప్రభుత్వం రూ.వేల కోట్ల బకాయిలకు అవకాశం ఇచ్చి.. తిరిగి ఆ తప్పిదాన్ని తమ ప్రభుత్వానికి అంటగట్టే ప్రయత్నం చేస్తోందని సీఎం రేవంత్ రెడ్డి మండిపడ్డారు. ఇప్పటికే బకాయిల వసూలులో కొంత పురోగతి ఉందని, అయితే ప్రతి ధాన్యం గింజకు చెందిన బకాయిని వసూలు

-మిగతా 2 లో





## షార్ట్ కట్స్ డేంజర్

- రీల్స్ యుగంలో సరైన మార్గంలో వెళ్లండి
- ప్రభావశీలురు అటూ ఇటూ లాగుతారు
- ఆరాధ్యనీయుల ఆత్మకథలు చదవండి
- జెన్‌జీకి ప్రధాని మోడీ పిలుపు
- జమిలీ ఎన్నికలపై మాజీ రాష్ట్రపతి కోవింద్ గొప్ప సూచనలు చేశారు
- కోవింద్ ఆత్మకథను ఆవిష్కరించిన ప్రధాని

02

రీల్స్, షార్ట్‌కట్స్ ప్రభావంలో పడకుండా జీవితంలో సరైన మార్గాన్ని ఎంచుకోవాలని జెన్‌జీకి ప్రధాని నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ ఆత్మకథను ఆవిష్కరించిన సందర్భంగా యువత ఆరాధించే మహనీయుల జీవిత చరిత్రలను చదవాలని సూచించారు. మరోవైపు జమిలి ఎన్నికలపై కోవింద్ చేసిన కృషిని ప్రశంసించిన మోదీ.. ఢిల్లీలో జరిగిన ఓ వివాహ రిసెప్షన్‌లో రాజకీయ విభేదాలను పక్కనపెట్టి మల్లికార్జున్ ఖర్గే, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ వాద్రాలతో సరదాగా ముచ్చటించారు. ఈ రెండు ఘటనలు రాజకీయ వర్గాల్లో ఆసక్తికరంగా మారాయి.

## జపాన్‌పైకి బాలిస్టిక్ మిస్సైల్ ప్రయోగించిన ఉత్తర కొరియా..



02

### నేడు కూకట్ పల్లిలో ఇందిరమ్మ

# టవర్స్‌కు శ్రీకారం

### కూకట్ పల్లిలో శంకుస్థాపన చేయనున్న ముఖ్యమంత్రి

- ఏడాదిలో గృహప్రవేశాలు జరిగేలా ప్రణాళిక
- కూకట్ పరిధిలో ఏడాదిలో లక్ష ఇళ్ల నిర్మాణమే ప్రభుత్వ లక్ష్యం
- తొలి విడతలో 16 నియోజకవర్గాల్లో 8 వేల ఇళ్ల నిర్మాణం
- అర్హులైన పేదలకు పారదర్శకంగా లక్కీ డిప్ ద్వారా కేటాయింపు
- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



హైదరాబాద్‌ఆగస్ట్ 12 (జర్నలిస్ట్ డైరీ) : హైదరాబాద్ మహానగరంలో ఎన్నో ఏళ్లుగా సొంతింటి కోసం ఎదురుచూస్తున్న నిరుపేద, మధ్యతరగతి కుటుంబాల కలలు సాకారం చేసే దిశగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రజా ప్రభుత్వం మరో చారిత్రాత్మక అడుగు వేస్తోందని రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. కూకట్ పరిధిలో చేపడుతున్న ప్రతిష్టాత్మక ఇందిరమ్మ టవర్స్ నిర్మాణానికి గురువారం సాయంత్రం కూకట్ పల్లి నియోజకవర్గంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా

-మిగతా 2 లో

### మాది టి-హబ్

# మీది ఎ-హబ్..

### అనుముల హబ్స్ ఏర్పాటులో సీఎం రేవంత్‌రెడ్డి బిజీగా ఉన్నడు

- అనుముల కొండల్‌రెడ్డిని ఇన్నోవేటర్ ఆఫ్ ది సెంచరీగా ప్రకటించాలి
- టెస్సెరాక్ట్ ఫ్యామిలీ రన్..డ్రైవ్ స్కామ్ జీరో ఎంప్లాయీస్.. జీరో ఇన్నోవేషన్
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఫైర్



హైదరాబాద్, ఆగస్ట్ 12 (జర్నలిస్ట్ డైరీ) : 'నిజమైన స్టార్టప్‌లు ఎదగాలని, నిరుద్యోగ యువతకు ఉపాధి దక్కాలని ఎంతో కష్టపడి బీఆర్ఎస్ సర్కార్ టీ-హబ్‌కు రూపకల్పన చేసింది. కానీ ప్రస్తుత కాంగ్రెస్ సీఎం రేవంత్‌రెడ్డి రాష్ట్ర ప్రయోజనాలను పక్కనపెట్టి కుటుంబ ప్రయోజనాల కోసం అనుముల హబ్స్ ఏర్పాటులో బిజీగా ఉన్నారు' అంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. బుధవారం 'ఎక్స్' వేదికగా మరోసారి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నదమ్ముల భూ

-మిగతా 2 లో

# పాక్ ఆర్మీ మారణకాండ.


**-బలూచిస్తాన్‌పై అర్ధరాత్రి వైమానిక దాడులు..**
**-28 మంది పౌరులు మృతి.. 17 మందికి గాయాలు**
**-మృతుల్లో 9 మంది చిన్నారులు, ఏడుగురు మహిళలు**
**-శిథిలాల కింద మరికొందరు చిక్కుకున్నట్లు అనుమానం**
**-ఘటనపై స్పందించని పాక్ మిలిటరీ**
**--బలూచ్ ఉద్యమాన్ని అణచివేస్తున్న పాక్ ప్రభుత్వం**
**-మిస్సైల్స్, డ్రోన్లతో దాడులు చేస్తున్నట్లు ఆరోపణలు**
**-గతంలోనూ పౌరులపై పాక్ ఆర్మీ దాడులు**

న్యూఢిల్లీ



బలూచిస్తాన్‌లో పాకిస్తాన్ ఆర్మీ దారుణ మారణకాండకు పాల్పడుతోంది. అమాయకులైన ప్రజలపై అర్ధరాత్రి వైమానిక దాడులకు దిగింది. మంగళవారం అర్ధరాత్రి పాక్ ఆర్మీ జరిపిన వైమానిక దాడిలో 28 మంది పౌరులు మరణించారు. 17 మందికిపైగా గాయపడ్డారు. అంతర్జాతీయ మీడియా ఈ వివరాల్ని వెల్లడించింది. పాక్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా బలూచిస్తాన్‌లో ప్రజలతోపాటు, ఉద్యమకారులు ఆందోళన చేస్తున్నారు. పాక్ ప్రభుత్వ అణచివేత, వివక్షకు వ్యతిరేకంగా రెండు నెలల నుంచి పోరాడుతున్నారు. అయితే, ఈ ఉద్యమాన్ని పాక్ ప్రభుత్వం అత్యంత దారుణంగా అణచివేస్తోంది.పాక్ పోలీసులతోపాటు ఏకంగా పాక్ ఆర్మీని ప్రయోగిస్తోంది. ఉద్యమకారులతోపాటు సాధారణ ప్రజల్ని కూడా కాల్చిచంపుతోంది. శాంతియుతంగా ఉద్యమం చేస్తున్న వారిపై కూడా వైమానిక దాడులకు దిగుతోంది. మిస్సైల్స్, డ్రోన్స్ ప్రయోగిస్తోంది. పిల్లలు, మహిళలు, వృద్ధులు కూడా ఈ ఘటనల్లో మరణిస్తున్నారు. తాజాగా, మంగళవారం అర్ధరాత్రి బలూచిస్తాన్‌లోని సూరబ్ జిల్లాలోని గోంధం గ్రామంపై అర్ధరాత్రి 2.00 గంటలకు పాక్ ఆర్మీ వైమానిక దాడి చేసింది. ఇళ్లల్లో ప్రశాంతంగా నిద్రిస్తున్న వారిపై దాడి చేయడంతో 28 మంది పౌరులు మరణించారు. 17 మంది గాయపడ్డారు. కూలిన ఇండ్ల శిథిలాల కింద మరింతమంది చిక్కుకున్నారు. వారిలో పిల్లలు, యువత కూడా ఉన్నారు. చాలా మంది నిద్రలోనే ప్రాణాలు కోల్పోయారు. మరణించిన వారిలో తొమ్మిది మంది పిల్లలు, ఏడుగురు మహిళలు సహా 12 మంది పురుషులు ఉన్నారు. ఈ ఘటనపై పాక్ మిలిటరీ మాత్రం స్పందించలేదు. పాక్ ఆర్మీకి చెందిన ఇంటర్ సర్వీస్ పబ్లిక్ రిలేషన్స్ విభాగం కూడా ఈ ఘటనపై ఎలాంటి ప్రకటనా చేయలేదు. ఈ దాడిలో పిల్లల మృతదేహాలు ముక్కలుగా, చెల్లాచెదురుగా పడిపోయాయి. అక్కడి పరిస్థితులు హృదయవిదారకంగా ఉన్నాయి. గాయపడిన వారిని స్థానిక ఆస్పత్రుల్లో చేర్చి, చికిత్స అందిస్తున్నారు. సాధారణ ప్రజలపై పాక్ ఆర్మీ దాడి చేయడం ఇదే మొదటిసారి కాదు. అక్కడ ఉద్యమాల్ని పాక్ ఆర్మీ దారుణంగా అణచివేస్తుంది. గత ఏడాది సెప్టెంబర్‌లో ఖైబర్ పఖ్తుంఖ్వాపై జరిపిన దాడిలో 30 మంది సాధారణ పౌరులు మరణించారు.

## పాన్ మసాలా, గుట్కాపై ఏడాదిపాటు నిషేధం విధించిన కర్ణాటక



న్యూఢీల్లి

రాష్ట్రంలో పొగాకు ఉత్పత్తులపై కర్ణాటక ప్రభుత్వం నిషేధం విధించింది. పొగాకు, నికోటిన్ ఉన్న పాన్ మసాలా, గుట్కాలపై ఏడాదిపాటు నిషేధం విధిస్తూ కర్ణాటక ప్రభుత్వం తాజాగా నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ తరఫున 'ద ఫుడ్ సేఫ్టీ అండ్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్ విభాగం (ఎఫ్‌డీఏడీ)' ఆదేశాలు జారీ చేసింది. దీని ప్రకారం రాష్ట్రంలో నిషేధిత పొగాకు ఉత్పత్తులు విక్రయించడం, రవాణా, పంపిణీ చేయడం కూడా నేరమే. ఎఫ్‌డీఏడీకి చెందిన అధికారులు తయారీదారులపై నిఘా పెడతారు.తయారీ సంస్థల్లో తనిఖీలు, నిల్వ, రవాణా, పంపిణీ, విక్రయాలపై ఇకపై నిషేధం ఉన్నందున అధికారులు తనిఖీలు చేసి, నోటీసులు జారీ చేస్తారు. జరిమానా కూడా విధిస్తారు. ఈ నిషేధం ఆగష్టు 10, 2026 నుంచి ఏడాది పాటు అమలులో ఉంటుంది. ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ యాక్ట్, 2026 లోని సెక్షన్ 30(2)(ఏ)తోపాటు, ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ (ప్రొహిబిషన్ అండ్ రెస్ట్రిక్షన్స్ సేల్స్) రెగ్యులేషన్స్, 2011 యాక్ట్ ప్రకారం ప్రభుత్వం ఈ ఆదేశాలు జారీ చేసింది. ప్రజల ఆరోగ్యం దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రభుత్వం తెలిపింది. నిషేధిత ఉత్పత్తుల విక్రయాలకు సంబంధించిన ఏదైనా సమాచారం ఉంటే ప్రజలు సంబంధిత అధికారులకు తెలియజేయాలి. నిషేధం కాని ఉత్పత్తుల విషయంలో కూడా కర్ణాటక ప్రభుత్వం కఠినంగా వ్యవహరించనుంది. ప్రతి ఉత్పత్తిదారుడు ప్యాకేజింగ్‌లో ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎఫ్ఎస్ఎస్ఏఐ) నిబంధనలు పాటించాయి. పాన్ మసాలా ప్యాకేజింగ్‌లో ప్లాస్టిక్ లేదా ప్లాస్టిక్ సంబంధిత మెటీరియల్ వాడకూడదు. పేపర్, పేపర్ బోర్డ్, సెల్యులోజ్, ఇతర సహజ ఉత్పత్తులు మాత్రమే వాడాలి. ప్లాస్టిక్, సింథటిక్ పాలిమర్, కో పాలిమర్స్, ల్యామినేట్స్ వాడకూడదు. అల్యూమినియం ఫాయిల్స్, మెటలైజ్డ్ లేయర్స్ కూడా వాడకూడదు. టిన్ అండ్ గ్లాస్ కంటైనర్స్ మాత్రం వాడొచ్చు.

## కేటీఆర్ అసత్య ప్రచారాన్ని మానుకోవాలి

మొదటి తరువాయి

లపారిశ్రామికవేత్తలను భయపెట్టడం కేటీఆర్‌కు మంచిది కాదన్నారు. తెలంగాణ అభివృద్ధిని అడ్డుకోవద్దని, తమపై ఉన్న కోపాన్ని తెలంగాణ ప్రజలపై చూపించవద్దని సూచించారు. బీఆర్ఎస్ గోబెల్స్ ప్రచారాన్ని ప్రజలు నమ్మలేదని, ఎంపీ, స్థానిక సంస్థల ఎన్నికల్లో ఆ పార్టీకి తగిన గుణపాఠం చెప్పారని శ్రీధర్‌బాబు అన్నారు. నీటి వాటాల విషయంలో బీఆర్ఎస్ ప్రభుత్వం తెలంగాణకు తీవ్ర నష్టం చేసిందని, రాష్ట్ర ప్రయోజనాల విషయంలో తాము రాజీపడబోమన్నారు. జీఆర్ఎంబీ సమావేశానికి హాజరై తెలంగాణ నీటి వాటాల కోసం బలంగా పోరాడుతామని మంత్రి శ్రీధర్‌బాబు స్పష్టం చేశారు.

## వయసొచ్చిన పిల్లల తల్లిదండ్రుల ఆస్తి కాదు..

మొదటి తరువాయి

వెళ్లి ఓ యువకుడితో కలిసి వెళ్లిపోయింది. పోలీసులు ఆమెను గుర్తించి తల్లికి అప్పగించారు. అయితే కొన్నాళ్ల తర్వాత ఆమె మళ్లీ ఇంటి నుంచి వెళ్లిపోవడంతో తన కుమార్తెను ఆ యువకుడు అక్రమంగా నిర్బంధించాడంటూ తల్లి హైకోర్టులో హెబియస్ కార్పస్ పిటిషన్ దాఖలు చేసింది. విచారణ సందర్భంగా కోర్టు నేరుగా ఆ యువతితో మాట్లాడింది. తాను తన ఇష్టప్రకారమే ఆ యువకుడితో కలిసి ఉంటున్నానని, అతనితోనే జీవించాలనుకుంటున్నానని స్పష్టంచేసింది. ప్రస్తుతం ఆ యువతి మేజర్ అని నిర్ధారించుకున్న న్యాయస్థానం.. ఆమె నిర్ణయాన్ని గౌరవించాలని తెలిపింది. అక్రమ నిర్బంధం అనేది రుజువు కానందున హెబియస్ కార్పస్ పిటిషన్ చెల్లదని స్పష్టంచేస్తూ తల్లి దాఖలు చేసిన పిటిషన్‌ను బాంబే హైకోర్టు నాగ్‌పూర్ ధర్మాసనం కొట్టివేసింది.ం

# మిల్లర్లను వదలొద్దు!

మొదటి తరువాయి



చేయాల్సిందేనన్నారు. బకాయిల వసూలుకు సంబంధించి విధివిధానాల రూపకల్పన చేయాలని అధికారులను సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. విధివిధానాల రూపకల్పన పూర్తయిన తర్వాత ఆ నివేదికను మంత్రివర్గ ఉప సంఘానికి సమర్పించాలని సీఎం సూచించారు. మంత్రివర్గ ఉప సంఘం పరిశీలన అనంతరం ప్రభుత్వం తగు నిర్ణయం తీసుకుంటుందని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. మొండి బకాయిదారులుగా మారిన మిల్లర్లకు కేటాయించే ధాన్యాన్ని మహిళా సంఘాలకు కేటాయించి మిల్లింగ్ బాధ్యతలను మహిళా సంఘాలకు అప్పగిస్తామని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. ప్రతి సీజన్ లో ధాన్యం నిల్వకు ఇబ్బందులు ఎదురవుతున్న నేపథ్యంలో ఇప్పటి నుంచే తగు కార్యాచరణ రూపొందించాలని సీఎం రేవంత్ రెడ్డి అధికారులకు సూచించారు. ధాన్యం భారీగా వచ్చే నల్గొండ, సూర్యాపేట, నిజామాబాద్, పెద్దపల్లి, కామారెడ్డి జిల్లాల్లో సైలో బ్యాగ్ నిర్మాణాలను పైలట్ ప్రాజెక్టు కింద చేపట్టాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. స్వయం సహాయక సంఘాల ఆధ్వర్యంలో సైలో బ్యాగ్ నిర్మాణాలకు నియోజకవర్గానికి 50 నుంచి 100 ఎకరాల భూమిని కేటాయిస్తామని సీఎం తెలియజేశారు. వీటి నిర్మాణానికి సంబంధించి రెవెన్యూ, పౌరసరఫరాలు, మహిళా సంక్షేమ శాఖల మంత్రులతో సమావేశం ఏర్పాటు చేస్తామని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. పీ జీ రామ్ జీ లో ఫ్లాట్‌ఫాంల నిర్మాణానికి అవకాశం ఉన్నందున, విశాలమైన ఫ్లాట్‌ఫాంలు నిర్మించి జర్మన్ టెంట్లతో ధాన్యం నిల్వకు ఉన్న అవకాశాలను పరిశీలించాలని సీఎం సూచించారు. మండల, గ్రామ స్థాయిలో ఉన్న ప్రైవేటు గోదాములు, ధాన్యం నిల్వకు ఉపయోగపడే కల్యాణ మండపాలు, పాత థియేటర్లు, ఇతర షెడ్లను ముందుగానే గుర్తించి ధాన్యం నిల్వకు లీజుకు తీసుకోవాలని సీఎం సూచించారు. సమీక్షలో సీఎం ప్రిన్సిపల్ సెక్రటరీ వి.శేషాద్రి, పౌరసరఫరాల సంస్థ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర, సౌత్ ఇండియా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ తుడి దేవేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# షాట్‌కట్స్ డేంజర్

**--రీల్స్ యుగంలో సరైన మార్గంలో వెళ్లండి**
**- ప్రభావశీలురు అటూ ఇటూ లాగుతారు**
**-- ఆరాధ్యనీయుల ఆత్మకథలు చదవండి**
**- జెన్‌జీకి ప్రధాని మోడీ పిలుపు**
**-- జమిలీ ఎన్నికలపై మాజీ రాష్ట్రపతి కోవింద్ గొప్ప సూచనలు చేశారు**
**-- కోవింద్ ఆత్మకథను ఆవిష్కరించిన ప్రధాని**



న్యూఢిల్లీ:
షార్ట్‌కట్స్ కోసం వెంపర్లాడితే అది అత్యంత ప్రమాదకరమని జెన్‌జీకి ప్రధాని నరేంద్ర మోడీ హెచ్చరించారు. బుధవారమిక్కడ 'ట్రయంఫ్ ఆఫ్ ది ఇండియన్ రిపబ్లిక్ మై లైఫ్ మై స్ట్రగుల్స్' (భారత గణతంత్ర విజయం నా జీవితం, నా పోరాటాలు) పేరిట మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ రచించిన ఆత్మకథను మోడీ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రసంగిస్తూ ప్రత్యేకంగా యువతరాన్ని వేడుకుంటున్నాను. ఇది రీల్స్ యుగం. సోషల్ మీడియా ప్రభావశీలురు ఇటు అటు లాగుతారు. షార్ట్‌కట్ల యుగంలో ఒక విషయం గుర్తుంచుకోండి. రైల్వే స్టేషన్లలో కొందరు వంతెన వాడకుండా రైలు పట్టాలు దాటుతుంటారు. అక్కడ షార్ట్‌కట్ మిమ్మల్ని కుదించేస్తుంది అని రాసి ఉంటుంది. మీరు ఆరాధించే వారి ఆత్మకథలను చదవండి అని షార్ట్‌కట్ల ద్వారా వెళ్లాలనుకుంటున్న యువతను వేడుకుంటున్నాను. చారిత్రక సంఘటనలను వేరే కోణంలో అర్థం చేసుకునే అవకాశాన్ని ఆత్మకథలు ఇస్తాయి. అవి చరిత్రకు దగ్గరగా ఉంటాయి. అందుకే భవిష్యత్ తరాల? ముఖ్యంగా యువతకు కోవింద్ కృషి ప్రయోజనం చేకూర్చాలని నేను కోరుకుంటున్నాను అని అన్నారు.

జమిలీ ఎన్నికలపై గొప్ప సూచనలు

రాష్ట్రపతి అనే అత్యున్నత పదవి నుంచి విరమించిన తర్వాత కూడా కోవింద్ విశ్రాంతి తీసుకోలేదు. ఒక దేశం ఒక ఎన్నికలు (జమిలీ ఎన్నికలు) వంటి ముఖ్యమైన అంశాలపై ఇప్పటికీ పనిచేస్తున్నారు. గొప్ప సూచనలు చేశారు. దేశాన్ని మేల్కొలుపుతున్నారు. జమిలీ ఎన్నికలు భారత ప్రజాస్వామ్యంలో కొత్త అధ్యాయం ప్రారంభించవచ్చు. కోవింద్ నిబద్ధత, సేవా భావం నుండి దేశ ప్రజలు చాలా నేర్చుకోవచ్చని నేను నమ్ముతున్నాను అని ప్రధాని తెలిపారు.

అప్పట్లో లేరు.. మీరు మారిపోయారు

దేశరాజధానిలో ఎన్సీపీ ఎంపీ సుప్రియా సూలే కుమార్తె రేవతి సూలే వివాహ రిసెప్షన్‌లో ఒక అరుదైన దృశ్యం ఆవిష్కృతమైంది. రాజకీయాలకు అతీతంగా ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, కాంగ్రెస్ ఎంపీలు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ వాద్రా ఒకే ఫ్రేమ్‌లో కనిపించారు. దీనికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయింది. ఇందులో నేతల మధ్య ఆప్యాయతతో కూడిన సంభాషణ చోటు చేసుకుంది. సంభాషణ ప్రారంభంలో ప్రియాంక ఎలా ఉన్నారు అని మోడీ అడిగారు. దానికి బాగున్నాను సార్ మీరు ఎలా ఉన్నారు అని ప్రియాంక ప్రత్యుత్తరమిచ్చారు. అయితే వీడియోలో ప్రియాంక కనిపించలేదు. దీనికి నేను ఎప్పటిలాగే ఉన్నాను అని ప్రధానమంత్రి జవాబిచ్చారు. ఈ సమాధానం విని దగ్గర నిలబడి ఉన్న కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే చిరునవ్వు నవ్వారు. భాయ్ సాబ్ మీరు కాస్త మారిపోయారు అని ఖర్గే మోడీతో అన్నారు. ఇట్లే మాట విని ప్రధానమంత్రి ఆశ్చర్యపోయినట్లు కనిపించారు. నిజమా అని అడిగారు. ఆ తర్వాత వారంతా నవ్వుల్లో మునిగిలేరు. ఈ సంభాషణను చూసి రాహుల్ గాంధీ కూడా నవ్వుతూ కనిపించారు. ఈ సంభాషణ ఎన్సీపీ ఎంపీ సుప్రియా సూలే కుమార్తె రేవతి సూలే నాగపూర్ పారిశ్రామికవేత్త నిరంజ్ లఖానీతో వివాహ రిసెప్షన్ జరిగింది. ఢిల్లీలోని 6 జన్పత్‌లో ఈ కార్యక్రమం జరిగింది. రాజకీయ విభేదాలు ఉన్నప్పటికీ నాయకులు ఒక చోట చేరి స్నేహపూర్వకంగా మాట్లాడ కున్న ఈ దృశ్యం నెటిజన్లలో ఆసక్తిని రేకెత్తించింది.

## నేడు కూకట్ పల్లిలో ఇందిరమ్మ టవర్స్‌కు శ్రీకారం

మొదటి తరువాయి

శంకుస్థాపన చేయనున్నారని వెల్లడించారు. ఇళ్ల నిర్మాణంపై బుధవారం అధికారులతో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ కూకట్ పల్లిలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు శంకుస్థాపన చేయనున్న ఐదు ఎకరాల ప్రాంతంలో నాలుగు టవర్స్ నిర్మిస్తున్నామని ఒక్కో టవర్ లో 120 చొప్పున ఫ్లాట్స్ ఉంటాయన్నారు. ఒక్కో ఫ్లోర్ లో 12 ఫ్లాట్స్ ఉండేలా 480 ఫ్లాట్స్ నిర్మాణం జరుగుతుందని దీనికోసం 43.20 కోట్ల రూపాయలు ఖర్చవుతుందని తెలిపారు. కూకట్ పరిధిలో ఇందిరమ్మ టవర్స్ నిర్మాణానికి ఇంతవరకు సుమారు 90 ఎకరాలను ఎంపిక చేశామని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. హైదరాబాద్ నగరం నడిబొడ్డున పేదవాడి ఇంటికి పునాది వేయడం అంటే కేవలం ఒక భవనం నిర్మించడం కాదు.. ఒక కుటుంబానికి భద్రత, ఒక తరానికి భరోసా, పేదవాడికి గౌరవంతో కూడిన జీవితం అందించడమే అని పేర్కొన్నారు. హైదరాబాద్ లో భూముల ధరలు ఆకాశాన్ని తాకుతున్న నేపథ్యంలో నగరంలోనే సొంత ఇల్లు కావాలనే పేదల ఆకాంక్షను నెరవేర్చేందుకు ఇందిరమ్మ టవర్స్ ను ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిందన్నారు. కూకట్ పరిధిలో ఇందిరమ్మ టవర్స్ నిర్మాణం హైదరాబాద్ గృహ నిర్మాణ రంగంలో ఒక కొత్త అధ్యాయానికి నాంది పలుకుతుందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం పేదలు నగరానికి దూరంగా కాకుండా.. నగరంలోనే గౌరవంగా జీవించాలి అనే లక్ష్యంతో ఈ ప్రాజెక్టును రూపకల్పన చేసిందన్నారు. నగరంలోని కీలక ప్రాంతాల్లో ప్రభుత్వ భూములను సద్వినియోగం చేసుకుని బహుళ అంతస్తుల టవర్లను నిర్మించడం ద్వారా వేలాది పేద కుటుంబాలకు సొంతింటిని అందించనున్నామని తెలిపారు. ఇది ఒకసారి చేపట్టి ముగించే పథకం కాదని, హైదరాబాద్ లో పేదల గృహ అవసరాలను దఫదఫాలుగా తీర్చే నిరంతర గృహ నిర్మాణ కార్యక్రమని స్పష్టం చేశారు. కూకట్ పరిధిలో ఈ ఏడాది లక్ష ఇళ్ల నిర్మాణం లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని, తొలి విడతలో ప్రయోగాత్మకంగా 16 అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో సుమారు 8,000 ఇళ్లను నిర్మించనున్నట్లు వెల్లడించారు. ఇందిరమ్మ టవర్స్ నిర్మాణానికి సంబంధించి గత నెల 20వ తేదీ నుంచి దరఖాస్తుల స్వీకరణ ప్రారంభించామని, ఇప్పటివరకు సుమారు 50 వేల దరఖాస్తులు అందాయని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ప్రజల నుంచి వచ్చిన విజ్ఞప్తులను పరిగణనలోకి తీసుకుని దరఖాస్తుల స్వీకరణ గడువును ఆగస్టు 15వ తేదీ వరకు పొడిగించినట్లు చెప్పారు. ఇందిరమ్మ టవర్లలో లబ్ధిదారులకు అందించే ఇళ్లు సౌకర్యవంతంగా, ఆధునిక ప్రమాణాలతో నిర్మించనున్నామని తెలిపారు. ప్రతిపాదిత ఇంటిలో ఒక బెడ్ రూమ్, హాల్, కిచెన్ తో కలిపి సుమారు 525 చదరపు అడుగుల విస్తీర్ణం ఉంటుందని చెప్పారు. నగరంలోని అత్యంత కీలక ప్రాంతాలను గుర్తించి, ఆయా ప్రాంతాల్లో అవసరాన్ని బట్టి పది అంతస్తుల వరకు టవర్లను నిర్మించనున్నట్లు వివరించారు. ప్రభుత్వ భూమిలో నిర్మిస్తున్న ఈ ఇళ్లలో లబ్ధిదారుడి పేరుతో అన్ డివైడెడ్ షేర్ కింద సుమారు 20 నుంచి 25 గజాల స్థలాన్ని రిజిస్ట్రేషన్ చేయనున్నట్లు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. కొన్ని ప్రాంతాల్లో ఒక్కో లబ్ధిదారుడికి లభించే భూమి వాటి విలువ సుమారు రూ. 60 లక్షల నుంచి రూ. కోటి వరకు ఉంటుందన్నారు. ఇలాంటి విలువైన ప్రాంతాల్లో పేదలకు సొంతింటి అవకాశం కల్పించడం దేశంలోని ఇతర మహానగరాలకు కూడా ఆదర్శంగా నిలిచే విధంగా తెలంగాణ ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. దరఖాస్తుల స్వీకరణ అనంతరం అర్హతలను పూర్తిస్థాయిలో పరిశీలించి, ఎలాంటి రాజకీయ జోక్యం, సిఫార్సులు, అక్రమాలకు తావులేకుండా అర్హులైన పేదల నుంచి పారదర్శక పద్ధతిలో డ్రా/లక్కీడిప్ ద్వారా ఇళ్ల కేటాయింపు చేపడతామని తెలిపారు. ఇల్లు మంజూరు కాని దరఖాస్తుదారులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, వారు చెల్లించిన ఈఎండీ మొత్తాన్ని వెంటనే తిరిగి చెల్లిస్తామన్నారు. ఇందిరమ్మ టవర్స్ నిర్మాణ పనులను ప్రణాళికాబద్ధంగా, వేగంగా పూర్తి చేసి వచ్చే ఏడాది బోనాల పండుగ సమయానికి ఎంపికైన లబ్ధిదారులతో గృహప్రవేశాలు చేయించడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. శంకుస్థాపన నుంచి నిర్మాణం పూర్తయ్యే వరకు ప్రతి క్షణం అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని ఇప్పటికే ఆదేశాలు జారీ చేశామని చెప్పారు. నాణ్యత విషయంలో ఎక్కడా రాజీ పడకుండా, నిర్ణీత గడువులో నిర్మాణాలను పూర్తి చేయాలని అధికారులకు సూచించినట్లు తెలిపారు. గత ప్రభుత్వాల హయాంలో పేదలకు ఇళ్ల విషయంలో హామీలు మాత్రమే మిగిలాయని, కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం మాత్రం హామీలను కార్యాచరణలోకి తీసుకువచ్చి, పేదల ఇంటి కలలు నిజమయ్యేలా గృహ నిర్మాణ కార్యక్రమాన్ని ముందుకు తీసుకెళ్తోందని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు.

## జపాన్‌పైకి బాలిస్టిక్ మిస్సైల్ ప్రయోగించిన ఉత్తర కొరియా..

**-వోన్సమ్ తీర ప్రాంతం నుంచి క్షిపణి ప్రయోగం**
**-జపాన్ ప్రత్యేక ఆర్థిక మండలి సమీపంలో పడిన మిస్సైల్**
**-యూఎస్-దక్షిణ కొరియా డ్రిల్స్‌కు ప్రతిగానే ప్రయోగం?**
**-ఆగస్టు 17 నుంచి సంయుక్త సైనిక విన్యాసాలు**
**-డ్రిల్స్‌ను దాడి సన్నాహకాలుగా భావిస్తున్న ఉత్తర కొరియా**
**-వారంలోనే రెండోసారి క్షిపణి పరీక్ష**
**-జపాన్ ప్రజల భద్రతకు ముప్పు: రక్షణ మంత్రి**
**-ప్రాంతీయ శాంతికి విఘాతం కలిగిస్తోందని జపాన్ ఆందోళన**
**--చైనా ద్వారా దౌత్యపరంగా నిరసన తెలిపిన టోక్యో**
**జపాన్, అమెరికా, దక్షిణ కొరియా సంయుక్త దర్యాప్తు**
**-ప్రాణ, ఆస్తి నష్టంపై వివరాలు వెల్లడించని జపాన్**



న్యూఢీల్లి

ఉత్తర కొరియా సైనిక చర్యలు అనూహ్యంగా ఉంటాయి. తాజాగా జపాన్‌పైకి ఉత్తర కొరియా ఒక బాలిస్టిక్ మిస్సైల్ ప్రయోగించింది. భారత కాలమానం ప్రకారం మంగళవారం అర్ధరాత్రి 2.30 గంటల సమయంలో ఉత్తర కొరియా తన తీర ప్రాంతం నంచి జపాన్‌పైకి ఒక మిస్సైల్‌ను పరీక్షించింది. వోన్సమ్ ప్రాంతంలోని ఉత్తర తీరం నుంచి ప్రయోగించిన ఈ మిస్సైల్.. జపాన్ స్పెషల్ ఎకనామిక్ జోన్ సమీపంలో పడ్డట్లు జపాన్ ప్రభుత్వం తెలిపింది.ఆగష్టు 17 నుంచి అమెరికా-దక్షిణ కొరియాల సంయుక్త సైనిక విన్యాసాలు ప్రారంభం కానున్నాయి. అమెరికా-దక్షిణ కొరియా ప్రతి ఏడాది వేసవిలో సైనిక విన్యాసాలు నిర్వహిస్తుంటాయి. అయితే, ఈ సైనిక విన్యాసాలు తమ దేశానికి ముప్పు అని, తమపై దాడికి ముందస్తు సన్నాహకంగానే ఇవి నిర్వహిస్తున్నాయని ఉత్తర కొరియా భావిస్తోంది. అందుకే, తమ సైనిక సత్తా కూడా చాటాలనే లక్ష్యంతో ఉత్తర కొరియా తాజాగా జపాన్‌పైకి మిస్సైల్ ప్రయోగించింది. ఇది వారంలో రెండో ఘటన. ఇటీవల కూడా ఉత్తర కొరియా.. జపాన్‌పైకి దాడికి దిగింది. ఈ అంశంపై జపాన్ రక్షణ శాఖ మంత్రి షింజిరో కొయిజుమి స్పందించారు. తమ దేశంపై జరిపిన మిస్సైల్ దాడితో ఈ ప్రాంతంలో శాంతికి విఘాతం కలుగుతుందని, భద్రతకు ముప్పు ఉందని వ్యాఖ్యానించారు. ఈ అంశంపై చైనా ద్వారా దౌత్యపరంగా తమ నిరసనను తెలియజేశామని చెప్పారు. ఈ చర్య తీవ్రమైన అంశమని, జపాన్ ప్రజల భద్రతకు ముప్పు అని ఆయన అన్నారు. ఈ దాడిపై జపాన్, దక్షిణ కొరియా, అమెరికా కలిసి సంయుక్తంగా విచారణ జరుపుతున్నాయి. జపాన్ సముద్ర తీరంలో పడిన ఈ మిస్సైల్ దాడి వల్ల జరిగిన ప్రాణ, ఆస్తి నష్టంపై ఎలాంటి వివరాల్ని జపాన్ వెల్లడించలేదు.

## మాది టి-హబ్ మీది ఎ-హబ్..

మొదటి తరువాయి

కుంభకోణాలపై స్పందించారు. రాష్ట్ర ఐటీశాఖ మంత్రి శ్రీధర్‌బాబు చేసిన వ్యాఖ్యలకు స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. 'కేవలం లక్ష రూపాయల పెట్టుబడితో వందలకోట్ల భూములు కొట్టేసే ఐడియా తెలంగాణ బిడ్డలకు చెప్పండి' అంటూ చురకలంటించారు

రాత్రికి రాత్రే రూ. 200 కోట్ల ఆస్తి

సర్కార్ భూములు పొందాలంటే అనుముల బ్రదర్స్ అయితే చాలని కేటీఆర్ విమర్శించారు. పెట్టుబడిలేని కంపెనీలు పెట్టి ఎంతటి విలువైన భూములనైనా దక్కించుకోవచ్చని దుయ్యబట్టారు. 'రూ. లక్ష పెయిడ్ అప్ క్యాపిటల్‌తో, కనీసం ఒక్క ఉద్యోగి కూడా లేకుండా టెస్సెరాక్ట్ అడ్వాన్స్‌డ్ సిస్టమ్ అనే డిఫెన్స్ కంపెనీ పెట్టి.. రాత్రికి రాత్రే దాదాపు రూ. 200 కోట్ల ఆస్తి/లాభం ఆర్జించిన అనుముల కొండల్‌రెడ్డిని ఇన్నోవేటర్ ఆఫ్ ది సెంచరీగా ప్రకటించండి. శ్రీధర్‌బాబు గారూ.. రాష్ట్రంలోని లక్షలాది మంది నిరుద్యోగ యువతకు ఈ అద్భుతమైన బిజినెస్ మాడల్ ఏంటో నేర్పించండి. వందల కోట్ల ప్రభుత్వ భూమిని ఇంత చౌకగా కొట్టేయడం ఎలాగో శిక్షణ ఇవ్వండి' అంటూ తనదైన శైలిలో వ్యంగ్యాస్త్రాలు సంధించారు. టెస్సెరాక్ట్ కంపెనీ ఏర్పాటు చేయడం.. 200 కోట్ల భూములు కొట్టేయడం ముమ్మాటికీ ఫ్యామిలీ రన్.. డ్రైవ్ స్కామ్ అని ఆరోపించారు. ఈ మ్యాజిక్ ట్రిక్ అనుముల బ్రదర్స్‌కే ఎందుకు పరిమితం కావాలి? అని ప్రశ్నించారు. తెలంగాణలోని నిరుద్యోగ యువతీయువకులందరికీ అనుముల హబ్‌లో అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు.

# చంద్రబాబు విజినరీ లీడర్

-ఎంపి కలిశెట్టితో రాష్ట్రపతి ముర్ము



**న్యూఢిల్లీ, ఆగస్ట్ 12 (జర్నలిస్ట్ డైరీ) :**
ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడిపై రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రశంసల జల్లు కురిపించారు. చంద్రబాబు విజనరీ లీడర్ అని.. అభివృద్ధికి అసలైన చిరునామా అంటూ కొనియాడారు. ఏ పని చేపట్టినా అద్భుతంగా చేయడం ఆయన ప్రత్యేకత అని అన్నారు. నిరంతర శ్రమ, దార్శనికత కలిగిన చంద్రబాబు.. నిజమైన అభివృద్ధికి చిరునామా అని అభివర్ణించారు. బుధవారం రాష్ట్రపతి ద్రౌపది ముర్మును విజయనగరం టీడీపీ ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు కుటుంబం కలిసింది. ఈ సందర్భంగా ప్రెసిడెంట్‌కు 'అమరావతి' కాఫీ టేబుల్ బుక్‌ను ఎంపీ అందజేశారు. పుస్తకంలోని ఫొటోలను ముర్ము ఆసక్తిగా తిలకించారు. ఈ సందర్భంగానే ఏపీ సీఎంపై ప్రశంసల జల్లు కురిపించారు. అంతేకాకుండా, 'అప్పలనాయుడిని చూస్తుంటే నన్ను నేను చూసుకున్నట్లే ఉంది' అని రాష్ట్రపతి అన్నారు. పార్లమెంట్‌కు సైకిల్‌పై రావడం, 100 శాతం హాజరుపై ఎంపీని ద్రౌపది ముర్ము అభినందించారు.

# నషీరుద్దీన్ షా ఓ నక్క..

-బీజేపీ ఎంపీ కంగనా రనౌత్ కౌంటర్




**న్యూఢిల్లీ: ఆగస్ట్ 12 (జర్నలిస్ట్ డైరీ) :**
బాలీవుడ్ నటుడు నషీరుద్దీన్ షాపై బీజేపీ ఎంపీ, నటి కంగనా రనౌత్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. నషీరుద్దీన్ షాను నక్కతో పోల్చారు. సీజేపీ విద్యార్థుల ఉద్యమం పట్ల బాలీవుడ్ సరైన రీతిలో స్పందించలేదని కొన్ని రోజుల క్రితం నషీరుద్దీన్ షా కామెంట్ చేశారు. ఆ నిరసన ప్రదర్శనల పట్ల అనేక మంది సెలబ్రిటీలు మౌనంగా ఉన్నట్లు ఆయన ఆరోపించారు. అవసరం వచ్చినప్పుడే వాళ్లు మాట్లాడుతారని, కుక్క నోట్లో బొక్క ఉన్నప్పుడు మాట్లాడలేదని నషీరుద్దీన్ షా ఆరోపించారు. అయితే నటుడు నషీరుద్దీన్ షా వ్యాఖ్యలకు కంగనా రనౌత్ కౌంటర్ ఇచ్చారు. జార్ఖండ్‌లో జరుగుతున్న ఆందోళనల గురించి షా ఎందుకు మాట్లాడం లేదని ఆమె ప్రశ్నించారు.షా వ్యాఖ్యలపై పీయూష్ మిశ్రా చేసిన వీడియోను కంగనా షేర్ చేశారు. ఈ నేపథ్యంలో నషీరుద్దీన్ షాను నక్కతో పోల్చుతూ బీజేపీ ఎంపీ కామెంట్ చేశారు. ప్రతి ఒక్కరు ఎవరో ఒకరి దగ్గర కుక్కలాగ పడి ఉండటం నిజమే అని, నేను ఈ దేశం అన్నం తింటున్నానని, ఈ దేశ రక్షణ చూసుకుంటానని, దీని కోసం పోరాడుతానని, కానీ నషీర్ సాబ్ మాత్రం ఈ దేశంలో ఉంటూ పొరుగు దేశం కోసం పోరాడుతారని అన్నారు. నాకు తిండి పెడుతున్న దేశాన్ని నేను కాపాడుకుంటానని, దీని పట్ల గర్వంగా ఫీలవుతున్నానని, కానీ ఈ నేలపై తిండి తింటున్న నషీర్ మాత్రం పొరుగు దేశాన్ని రక్షిస్తున్నారని కంగనా రనౌత్ తన సోషల్ మీడియా పోస్టులో రాశారు.

# కొలంబియా భూకంపం..

-250 దాటిన మృతుల సంఖ్య



**న్యూఢిల్లీ, ఆగస్ట్ 12 (జర్నలిస్ట్ డైరీ) :**
కొలంబియాలో భూకంప మృతుల సంఖ్య 250 దాటింది. సోమవారం 7.4 తీవ్రతతో ఆ దేశాన్ని భూకంపం షేక్ చేసిన విషయం తెలిసిందే. పెరిరా, కాలి ప్రాంతాల్లో భారీ సంఖ్యలో భవంతులు నేలమట్టం అయ్యాయి. ఆ శిథిలాల కింద ఇంకా వందల సంఖ్యలో జనం చిక్కుకుని ఉంటారని భావిస్తున్నారు. పర్వత ప్రాంతమైన పశ్చిమ కొలంబియాలో ప్రస్తుతం ఆర్తనాదాలు మిన్నంటుతున్నాయి. ఆ ప్రాంతంలో ఉన్న అపార్ట్‌మెంట్లు, ఇండ్లు, స్కూళ్లు, హెల్త్ సెంటర్ల భవనాలన్నీ పగుళ్లు వచ్చాయి. వేర్వేరు నగరాల్లో నమోదు అయిన డేటా ప్రకారం ఇప్పటి వరకు 254 మంది మృతిచెందినట్లు తెలుస్తోంది.పెరిరా సిటీలో 101 మంది మరణించారు. కాలిలో మరో 95 మంది ప్రాణాలు కోల్పోయారు. పసిఫిక్ సముద్రం దిశగా ఉన్న చాకో ప్రాంతంలోని స్థానిక తెగలకు ఇంకా విద్యుత్తు సరఫరా అందడం లేదు. గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న కాఫీ తోటలన్నీ దెబ్బతిన్నట్లు సమాచారం ఉన్నది. దీంతో నేషనల్ కాఫీ ఫెడరేషన్.. గ్రామీణ కాఫీ తోటల వ్యక్తులతో టచ్‌లో ఉన్నది. నష్టాన్ని అంచనా వేస్తున్నారు. శిథిలాల్లో చిక్కుకున్న అనేక మందిని ఇంకా తొలగిస్తున్నారు.

# మహిళా బిల్లు ముద్దు..
# డీలిమిటేషన్ వద్దు

-ప్రస్తుత సంఖ్య ఆధారంగా
33శాతం మహిళా రిజర్వేషన్లు
-తమిళనాడు అసెంబ్లీలో సీఎం విజయ్ తీర్మానం



**చెన్నై, ఆగస్ట్ 12 (జర్నలిస్ట్ డైరీ) :**
అసెంబ్లీ సమావేశాల్లో భాగంగా తమిళనాడు ప్రభుత్వం వరుస తీర్మానాలను ప్రవేశపెడుతోంది. మొన్న రాష్ట్రగీతం, నిన్న నీట్.. నేడు డీలిమిటేషన్‌పై తీర్మానాలను తీసుకువచ్చింది. లోక్‌సభ నియోజకవర్గ పునర్విభజన డీలిమిటేషన్ కు వ్యతిరేకంగా తమిళనాడు సీఎం విజయ్ అసెంబ్లీలో తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. డీలిమిటేషన్‌కు తాము అంగీకరించేదే లేదని స్పష్టం చేశారు. జనాభా నియంత్రణకు అనేక చర్యలు తీసుకున్న తమిళనాడుకు డీలిమిటేషన్‌తో నష్టం జరుగు తుందని అన్నారు. జనాభా ఆధారంగా నియోజకవర్గ పునర్విభజన జరిగితే దక్షిణాది రాష్ట్రాలన్నిటికీ నష్టమని చెప్పారు. ఈ తీర్మానంలో సీఎం విజయ్ మొత్తం మూడు డిమాండ్స్‌ను కేంద్రం ముందుంచారు. లోక్‌సభ సీట్ల సంఖ్యను ఎప్పటికీ 543 వద్ద స్తంభింపజేయాలని అన్నారు. రాష్ట్రాలకు ప్రస్తుతమున్న ఎంపీ సీట్ల సంఖ్యను శాశ్వతం చేయాలని అన్నారు. రాష్ట్రాల అసెంబ్లీల్లో కూడా మహిళలకు 33 శాతం రిజర్వేషన్ తీసుకురావాలని అన్నారు. నియోజకర్గాల పునర్ వ్యవస్థీకరణ (ఆ÷తిపతిబిజీబితినీని) కోసం కేంద్రం తీసుకువచ్చిన బిల్లును వ్యతిరేకించింది. అదే సమయంలో మహిళా రిజర్వేషన్‌కు మద్దతు ఇచ్చింది. ప్రస్తుతమున్న 543 సీట్లతోనే దానిని అమలు చేయాలని విజయ్ ప్రభుత్వం విజ్ఞప్తి చేసింది.తమిళనాడు వంటి దక్షిణాది రాష్ట్రాలు జనాభా నియంత్రణను విజయవంతంగా అమలు చేశాయని ఈ సందర్భంగా సీఎం విజయ్ అన్నారు. జనాభా ప్రాతిపదికన నియోజకవర్గాల పునర్విభజన జరిగితే నష్టం వాటిల్లొచ్చని హెచ్చరించారు. ప్రస్తుతం ఉన్న 543 లోక్‌సభ స్థానాలను అలాగే కొనసాగించాలి. ప్రతి రాష్ట్రానికి ప్రస్తుతం కేటాయించిన స్థానాలను శాశ్వతం చేయాలి. రాష్ట్ర శాసనసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించాలని కేంద్రం ముందు మూడు డిమాండ్లు ఉంచారు. మహిళలకు చట్టసభల్లో 33శాతం రిజర్వేషన్లను 2029 సార్వత్రిక ఎన్నికలకు ముందే కల్పించడానికి పార్లమెంటు ఆమోదం కోసం కేంద్ర ప్రభుత్వం మరోసారి ప్రయత్నిస్తోంది. 543 లోక్‌సభ నియోజకవర్గాలను పునర్విభజించి 816కి పెంచే ప్రతిపాదనపైనా అడుగు ముందుకు వేయాలని చూస్తోంది. ఈ సమయంలో తమిళనాడు ప్రభుత్వం తీర్మానాన్ని ప్రవేశపెట్టడం గమనార్హం. ఇటీవల పశ్చిమబెంగాల్, మహారాష్ట్రల్లో రాజకీయ సమీకరణాల మార్పులతో ఎన్డీయే బలం మరింత పెరిగిందన్న వ్యాఖ్యలు వినిపిస్తున్న విషయం తెలిసిందే. దీంతో, కేంద్రం డీలిమిటేషన్, మహిళా రిజర్వేషన్ బిల్లును తెచ్చేందుకు మరోసారి ప్రయత్నిస్తుందన్న వార్తలు వచ్చాయి. అయితే, డీలిమిటేషన్‌ను దక్షిణాది రాష్ట్రాలు మొదటి నుంచీ వ్యతిరేకిస్తున్నాయి. ఈ నేపథ్యంలో తమిళనాడు సీఎం విజయ్ ప్రవేశపెట్టిన తీర్మానం ప్రాధాన్యాన్ని సంతరించుకుంది.

# ఇమ్రాన్ ఖాన్ ఆరోగ్యంపై ఉత్కంఠ..

జైల్లోనే మరణించి ఉండొచ్చన్న జర్నలిస్ట్



**న్యూఢిల్లీ, ఆగస్ట్ 12 (జర్నలిస్ట్ డైరీ) :**
పాకిస్థాన్ మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్ ఆరోగ్యంపై తీవ్ర ఉత్కంఠ నెలకొన్నది. ఆయన జైల్లోనే మృతిచెంది ఉండొచ్చంటూ పాకిస్థాన్‌కు చెందిన ఓ సీనియర్ జర్నలిస్టు చేసిన వ్యాఖ్యలు కలకలం రేపుతున్నాయి. అయితే ఈ వాదనకు ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ధ్రువీకరణ లేదు. అమెరికాలో ఉంటున్న జర్నలిస్ట్ వజాహత్ సయీద్ ఖాన్ ఓ ఇంటర్వ్యూలో సంచలన వ్యాఖ్యలు చేశారు.ఇమ్రాన్ ఖాన్ ఇప్పుడు జీవించి లేరని ముగ్గురు సీనియర్ పాకిస్థాన్ సైనిక అధికారులు తనకు చెప్పినట్లు ఆయన పేర్కొన్నారు. అయితే వాళ్లు కూడా ఈ సమాచారాన్ని స్వయంగా నిర్ధారించలేదని చెప్పారు. అనధికారిక మార్గాల్లో తమకు సమాచారం అందిందని మాత్రమే వారు చెప్పినట్లు వివరించారు. 73 ఏళ్ల ఇమ్రాన్ ఖాన్ 2023 నుంచి రావల్పిండిలోని అడియాలా జైలులో ఉన్నారు. ఆయనపై పలు కేసులు కొనసాగుతున్నాయి. జైల్లో ఉన్న ఆయనను కలిసేందుకు కుటుంబసభ్యులకు అనుమతి ఇవ్వడం లేదంటూ పాకిస్థాన్ తెహ్రీక్-ఏ-ఇన్సాఫ్ (పీటీఐ) పార్టీ పలుమార్లు ఆరోపించింది. ఆయనకు సరైన వైద్యం అందడం లేదని కూడా పార్టీ నేతలు చెబుతున్నారు. ఇమ్రాన్ కుటుంబసభ్యులు, పీటీఐ నేతలు మంగళవారం మరోసారి ఆందోళన వ్యక్తంచేశారు. ఆయన ఆరోగ్య పరిస్థితిపై స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇమ్రాన్‌ను కలిసేందుకు అనుమతి ఇవ్వకపోతే సెప్టెంబర్ 27న ఇస్లామాబాద్‌కు లాంగ్ మార్చ్ చేపడతామని పీటీఐ ప్రకటించింది. అంతకుముందే నిరసనలు చేపడతామని పీటీఐ హెచ్చరించింది. ఇమ్రాన్ ఖాన్ ఆరోగ్య పరిస్థితిపై అమెరికా నుంచి కూడా పాకిస్థాన్‌పై ఒత్తిడి పెరుగుతోంది. 13 మంది అమెరికా చట్టసభ సభ్యులు అక్కడి విదేశాంగ మంత్రి మార్కో రూబియోకు లేఖ రాశారు. ఇమ్రాన్ ఆయన భార్య బుష్రా బీబీ నిర్బంధ పరిస్థితులపై ఇస్లామాబాద్‌తో మాట్లాడాలని కోరారు.

## ఇంట్లో భారీగా కరెన్సీ నోట్ల కట్టల కేసు..
# దోషిగా తేలిన జస్టిస్ యశ్వంత్ వర్మ



**న్యూఢిల్లీ,ఆగస్ట్ 12 (జర్నలిస్ట్ డైరీ) :**
ఇంట్లో భారీగా నోట్ల కట్టలు లభించిన కేసులో ఢిల్లీ హైకోర్టు మాజీ జడ్జి యశ్వంత్ వర్మ దోషిగా తేలాడు. అతడిపై మోపిన అభియోగాలు అన్నీ నిజమే అని లోక్‌సభ ప్యానెల్ నిర్ధరించింది. అయితే, ఈ విషయంలో అతడిపై ఏ చర్యలు తీసుకుంటారు అనే విషయంలో ఇంకా స్పష్టత లేదు. ఢిల్లీ హైకోర్టు మాజీ జడ్జి, రిటైర్డ్ జస్టిస్ యశ్వంత్ వర్మ ఢిల్లీలోని 30 తుగ్లక్ రోడ్డులోని ప్రభుత్వ భవనాల్లో నివాసం ఉంటున్నాడు. గత ఏడాది మార్చి 14-15 తేదీల మధ్య అతడి ఇంట్లో అగ్నిప్రమాదం జరిగింది. దీంతో అగ్నిమాపక సిబ్బంది అక్కడికి వెళ్లి మంటలను ఆర్పేశారు. ఈ ఘటనకు సంబంధించి అప్పట్లో కొన్ని ఫొటోలు బయటపడ్డాయి. సంచలన విషయాలు వెలుగు చూశాయి.అగ్నిప్రమాదం జరిగిన యశ్వంత్ వర్మ ఇంట్లో భారీగా నోట్ల కట్టలున్నాయి. ఇంటి స్టోర్ రూమ్‌లో ఈ నోట్ల కట్టలు చాలా వరకు కాలిపోయాయి. కొన్ని ధ్వంసమయ్యాయి. అవన్నీ రూ.500 నోట్ల కట్టలే. ఈ అంశం వివాదాస్పదం కావడంతో పోలీసులు, ఇతర అధికారులు ఆ ఇంటికి వెళ్లి ఆ ప్రదేశాన్ని సీజ్ చేశారు. అప్పటికే ఇంట్లోని సాక్ష్యాలు తారుమారు అయ్యాయి. ఫొటోల్లో కనిపించిన కరెన్సీ నోట్లు ఆ సమయానికి అక్కడ లేవు. మొదట ఈ నోట్ల కట్టలకు, తనకు సంబంధం లేదని యశ్వంత్ వర్మ చెప్పాడు. అసలు, ఈ నోట్లు తన ఇంటికి సంబంధం లేదని చెప్పాడు. అయితే, ఒక రిటైర్డ్ జడ్జి ఇంట్లో భారీగా నోట్ల కట్టలు కనిపించడం సంచలనంగా మారింది. జడ్జిల అవినీతి అంశం తెరమీదకు వచ్చింది. దీంతో ఈ అంశంపై పెద్ద దుమారం రేగింది. చివరకు దీనిపై పార్లమెంట్ స్పందించింది. ఈ అంశంపై విచారణ జరిపేందుకు లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా ఒక ప్యానెల్ ఏర్పాటు చేశారు. ఈ ప్యానెల్.. ఈ అంశంపై విచారణ జరిపింది. పలుమార్లు యశ్వంత్ వర్మను ప్రశ్నించింది. అయితే, ఈ విచారణ తర్వాత అతడిని ప్యానెల్ దోషిగా గుర్తించింది. ఇందుకు ప్రధాన కారణాలు ఇవి. ఆ డబ్బు ఎక్కడి నుంచి వచ్చింది.. అది ఎవరిది.. ఆ డబ్బు ఎంత ఉంటుంది.. వంటి వివరాలపై యశ్వంత్ వర్మ సరైన సమాధానం చెప్పలేకపోయారు. ఆ డబ్బు ఎక్కడినుంచి వచ్చిందో తనకు తెలియదన్నాడు. ఇతరులు తన ఇంటిని అక్రమంగా వాడుకునే అవకాశం ఉందని, ఎవరో తనకు తెలియకుండా డబ్బు తన ఇంట్లో పెట్టారని వర్మ చెప్పాడు. తనపై కుట్ర చేసి ఎవరో ఆ నోట్లు తన ఇంట్లో పెట్టారని చెప్పాడు. అయితే, ఇందుకు తగ్గ సాక్ష్యాల్ని ఆయన చూపించలేకపోయారు. ఆయన చెప్పిన సమాధానాలు నమ్మలేని విధంగా ఉన్నాయి. విచారణ ప్యానెల్ కూడా ఆ ఇంట్లోకి బయటి వ్యక్తులు వచ్చి, అంత డబ్బు ఉంచినట్లు ఆధారాలు లేవని తేల్చారు. మరోవైపు కాలిపోయిన నోట్లు తర్వాత కనిపించకపోవడంపై కూడా వర్మ సరైన సమాధానం చెప్పలేకపోయారు. సాధారణంగా ఏదైనా ఘటన జరిగితే.. అక్కడ సాక్ష్యాల్ని అలాగే ఉంచుతారు. కానీ, కరెన్సీ నోట్లు దొరికిన అతడి స్టోర్ రూమ్‌లో అవేమీ కనిపించలేదు. నోట్లను మాయం చేశారు. వాటి లెక్క కూడా తేలలేదు. సమాధానాలు దాటవేయడం, తప్పించుకోవాలని చూడటం కారణాలతో ఈ అంశంలో యశ్వంత్ వర్మను లోక్‌సభ ప్యానెల్ దోషిగా తేల్చింది. వర్మ దోషిగా తేలిన నేపథ్యంలో అతడిపై ఎలాంటి చర్యలు తీసుకుంటారో చూడాలి.

## బాలిక గర్భవతి అని ప్రభుత్వ ఆసుపత్రిలో నిర్ధారణ..
## కాదని తేల్చిన ప్రైవేట్ హాస్పిటల్



**న్యూఢిల్లీ, ఆగస్ట్ 12 (జర్నలిస్ట్ డైరీ) :**
నెలసరి సమస్యలకు చికిత్స కోసం అడ్మిట్ అయిన బాలిక గర్భవతి అని ప్రభుత్వ ఆసుపత్రిలో నిర్ధారించారు. దీంతో ఆ యువతి తల్లిదండ్రులు ఆందోళన చెందారు. అయితే ప్రైవేట్ ఆసుపత్రిలో నిర్వహించిన వైద్య పరీక్షల్లో ఆ బాలిక గర్భం దాల్చలేదని తేలింది. ఈ నేపథ్యంలో ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యుల నిర్లక్ష్యంపై విమర్శలు వెల్లువెత్తాయి. మహారాష్ట్రలోని థానే జిల్లాలో ఈ సంఘటన జరిగింది. 17 ఏళ్ల బాలిక నెలసరి సమస్యలతో బాధపడుతున్నది. చికిత్స కోసం కళ్యాణ్-డోంబివ్‌లి ప్రాంతంలోని శాస్త్రి నగర్ ప్రభుత్వ ఆసుపత్రిలో ఆమె అడ్మిట్ అయ్యింది. అయితే బాలిక కుటుంబ సభ్యుల అనుమతి లేకుండానే ఆమెకు మూడుసార్లు గర్భధారణ పరీక్షలు చేశారు. ఆ బాలిక గర్భం దాల్చినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ విషయాన్ని ఆమె కుటుంబ సభ్యులకు తెలియజేశారు.కాగా, ఇది తెలుసుకుని బాలిక కుటుంబ సభ్యులు ఆందోళన చెందారు. నిర్ధారణ కోసం ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ నిర్వహించిన వైద్య పరీక్షల్లో ఆ బాలిక గర్భం దాల్చలేదని తేలింది. అనంతరం పిరియడ్స్ సమస్యకు సంబంధించిన చికిత్సను అక్కడ అందించారు. దీంతో ఆ బాలిక కుటుంబ సభ్యుల ఆందోళన తొలగిపోయింది. మరోవైపు ఈ సంఘటన నేపథ్యంలో ప్రభుత్వ ఆసుపత్రిలో అనుసరించిన పరీక్షా విధానాలు, వైద్య ప్రక్రియలపై అనుమానాలు వ్యక్తమయ్యాయి. దీనికి బాధ్యులైన వారిపై కేసు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని ఆ బాలిక కుటుంబ సభ్యులు డిమాండ్ చేశారు. స్టాండింగ్ కమిటీ సమావేశంలో ఈ విషయం ప్రస్తావనకు రావడంతో మున్సిపల్ కమిషనర్ విచారణకు ఆదేశించారు.

జర్నలిస్ట్ డైరీ
తెలుగు దినపత్రిక

# డీకే ఎన్‌క్లేవ్‌లో ‘వన్ డే వన్ వార్డ్’ కార్యక్రమం

**- మౌలిక వసతుల కల్పనకు పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ హామీ**




**రంగారెడ్డి జిల్లా బ్యూరో, ఆగస్ట్ 12 (జర్నలిస్ట్ డైరీ) :** మియాపూర్ డివిజన్ పరిధిలోని డీకే ఎనక్లేవ్ కాలనీ లో జరిగిన వన్ డే వన్ వార్డ్ కార్యక్రమంలో భాగంగా కాలనీలలో నెలకొన్న పలు సమస్యలు మరియు చేపట్టవలసిన పలు అభివృద్ధి పనుల పై సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ ఐఏఎస్ అధికారి జి. సృజన, జోనల్ కమిషనర్ నారాయణ్ అమిత్ మాలెంపాటి, డీసీ శ్రీనివాస్ యాదవ్, తాజా మాజీ కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ మరియు సీఎంసీ పలు విభాగాల అధికారులు , కాలనీల రేసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులతో కలిసి సమీక్షా సమావేశం జరిపిన పియేసి చైర్మన్ ఆరెకపూడి గాంధీ. ఈ సందర్భంగా గౌరవ గాంధీ మాట్లాడుతూ... వన్ డే వన్ వార్డ్ కార్యక్రమంలో భాగంగా కాలనీల రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులతో సీఎంసీ అధికారులతో ముఖాముఖి సమావేశం నిర్వహించుకోవడం జరిగినది.కాలనీల వాసులు పలు సమస్యలను మరియు చేపట్టవలసిన పలు అభివృద్ధి పనులను కమిషనర్ గారి దృష్టికి , నా దృష్టికి తీసుకురావడం జరిగినది అని తెలియచేసారు. కాలనీల సమస్యలను ప్రథమ ప్రాధాన్యత గా తీసుకొని త్వరితగతిన పూర్తి అయ్యేలా చూడలని, పనులలో అలసత్వం ప్రదర్శించకుండా త్వరితగతిన పూర్తి అయ్యేలా చూడలని తెలియచేసారు. మియాపూర్ డివిజన్ పరిధి లోనీ రోడ్లు, డ్రైనేజీ , విధి దీపాలు, మంచి నీటి వంటి అన్ని రకాల మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తామని, పార్క్ లను అన్ని హంగులతో, సకల సౌకర్యాలతో సుందర శోభిత వనంలు గా తీర్చిదిద్దుతామని, ఓపెన్ జిమ్ లు ఏర్పాటు చేస్తామని , పిల్లలు, వృద్ధులు సేద తీరడానికి అనువుగా అన్ని రకాల వసతులు ఏర్పాటు చేస్తామని, కాలనీలలో ప్రజలకు చక్కటి ఆహ్లాదకమైన , ప్రశాంతమైన వాతావరణం కల్పిస్తామని తెలియచేసారు అదేవిధంగామియాపూర్ డివిజన్ పరిధిలో నెలకొన్న పలు సమస్యలు మరియు చేపట్టవలసిన పలు అభివృద్ధి పనుల పై సైబరాబాద్ మున్సిపల్ కమిషనర్ సృజన తో చర్చించడం జరిగింది , పెండింగ్ లో ఉన్న పనులు త్వరితగతిన పూర్తయ్యేలా అధికారులకు ఆదేశాలు ఇవ్వాలని, అసంపూర్తిగా మిగిలిపోయిన పనులు త్వరితగతిన పూర్తయ్యేలా చూడలని , అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని, పనులలో వేగం పెంచాలని సకాలంలో నిధులు మంజూరు అయ్యేలా చూడలని , అభివృద్ధి పనులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా చూడలని,ప్రజలకు అన్ని రకాల మౌలిక వసతుల కల్పనకు కృషి చేయాలని, సీసీ రోడ్ల కు నిదులు మంజూరి చేయాలని, రోడ్ల మరమ్మత్తులు చేపట్టాలని కోరారు.వర్షాకాలం ను దృష్టిలో పెట్టుకొని అసంపూర్తిగా మిగిలిపోయిన నాలల విస్తరణ పనులు చేపట్టాలని, నీటి ప్రవాహం సాఫీగా సాగేలా చూడలని, పార్క్ ల అభివృద్ధి మరియు సుందరీకరణ చేపట్టాలని, పనులలో ప్రత్యేక దృష్టి సారించాలని, ప్రతి కాలనీ లో పార్క్ లను అభివృద్ధి చేయాలని , ప్రజలకు చక్కటి ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించాలని కమిషనర్ దృష్టికి తీసుకువెళ్లడం జరిగినది. ప్రజలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా అన్ని రకాల మౌలిక వసతులు ఏర్పాటు కు కృషి చేస్తామని, మియాపూర్ వార్డ్ ను అన్ని రంగాలలో అభివృద్ధి చేస్తామని, శేరిలింగంపల్లి నియోజకవర్గ అభివృద్ధికి శాయ షేక్తుల కృషి చేస్తానని తెలియచేసారు.ప్రతి కాలనీలో ప్రతి ఒక్కరు ఇంటి ఆవరణలో ఇంకుడు గుంత ను తప్పనిసరిగా ఏర్పాటు చేసుకోవాలని, వర్షపు నీటి ని ఒడిసి పట్టుకోవాలని, ఇంటి ఆవరణ ప్రాంతంలో ఇంకుడు గుంత ను ఏర్పాటు చేసుకొని ప్రతి కాలనీ కి ఆదర్శంగా నిలవాలని ఒక సామాజిక బాధ్యత గా ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవాలని , మన పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని తడి చేత పొడి చెత్తను వేరు చేసి పారిశుధ్య ఆటో సిబ్బందికి అందచేయాలని, పారిశుధ్య సిబ్బంది కాలనీలలో పేరుకుపోయిన చెత్త చెదరం , మట్టి కుప్పలను ఎప్పటికప్పుడు తొలగించాలని, చక్కటి ఆహ్లాదకరమైన వాతావరణంను అందించాలని తెలియచేసారు.ఈ కార్యక్రమంలో సీఎంసీ ఇంజనీరింగ్ విభాగం అధికారులు. టౌన్ ప్లానింగ్ విభాగం, జలమండలి విభాగం మరియు నాయకులు , కార్యకర్తలు, కాలనీల వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# ఎల్బీనగర్ ఏసీపి కార్యాలయంలో కానిస్టేబుల్ ఆత్మహత్య



మృతుడు కానిస్టేబుల్ సాయి



పోలీస్ స్టేషన్ ముందు బాధితుల ఆందోళన

**-వేధింపులే కారణమంటూ స్టేషన్ ఆవరణలో కుటుంబ సభ్యుల ఆందోళన**
**-ప్రభుత్వ ఉద్యోగం, పెంచన్: మల్ రెడ్డి రంగా రెడ్డి**

**(జర్నలిస్ట్ డైరీ) : ఆగస్టు 12 ఎల్బీనగర్ :** ఎల్బీ నగర్ ఏసీపీ కార్యాలయంలో అటాచ్‌మెంట్‌పై విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్ జర్పుల సాయికుమార్ (25) బుధవారం వేకువజమున ఆత్మహత్యకు పాల్పడిన ఘటన తీవ్ర కలకలం రేపింది. దీంతో సాయి కుమార్ కుటుంబసభ్యులు బంధువులు పోలీస్ స్టేషన్ ఆవరణ లో తీవ్ర ఆందోళన కు దిగారు తమ కుమారుడు ది ఆత్మ హత్య కాదని ఉన్నతాధికారుల వేధింపుల వల్లనే ఈ ఘటన జరిగిందని ఆరోపిస్తూ గంటల తరబడి నినాదాలు చేశారు. పూర్తి వివరాలు కుటుంభ సభ్యులు పోలీసులు తెలిపిన ప్రకారం. రంగారెడ్డి జిల్లా మంచాల్ మండలానికి చెందిన సాయికుమార్ 2024 లో కానిస్టేబుల్ గా ఎన్నికై ఎల్బీ నగర్ పోలీస్ స్టేషన్ లో విధులు నిర్వహిస్తున్నాడు. కాగా గత నెల నుంచి ఎల్బీనగర్ పోలీస్‌స్టేషన్ నుంచి ఏసీపీ కార్యాలయానికి అటాచ్‌మెంట్‌పై ఈ కాప్స్ లో విధులు నిర్వహిస్తున్నాడు. కాగా మంగళవారం రాత్రి నైట్ డ్యూటీ నిర్వహిస్తున్న సాయి కుమార్ విధుల్లో భాగంగా ఆ రోజు అర్ధరాత్రి ఒంటి గంట కు డీఎస్ఆర్‌కు సంబంధించి డీసీపీ కార్యాలయ సిబ్బంది కి సమాచారం ఇవ్వాలి కానీ రాత్రి 2 గంటలు అవుతున్న ఎల్బీ నగర్ ఏసీపీ కార్యాలయం నుండి సమాచారం రాకపోడంతో ఎల్బీ నగర్ డీసీపీ ఆఫీస్ సిబ్బంది వెంటనే ఏసీపీ కార్యాలయానికి ఫోన్ చేసినా స్పందన రాలేదు. దీంతో ఎల్బీనగర్ పోలీస్‌స్టేషన్ లో నైట్ డ్యూటీ చేస్తున్న డి ఐ నరేందర్ మరియు ఇతర సిబ్బంది కి డీసీపీ ఆఫీస్ నుండి సమాచారం అందించారు. దీంతో సెక్షన్ ఇన్‌చార్జి హెడ్ కానిస్టేబుల్ వేణుగోపాల్ సుమారు 2.30 గంటలకు ఏసీపీ కార్యాలయానికి వెళ్లి పరిశీలించగా.. ఏసీపీ కార్యాలయం లో ఉండే రెస్ట్‌రూమ్‌లో సాయికుమార్ శాలువతో ఆత్మ హత్య కు పాల్పడినట్లు గుర్తించారు. వెంటనే సాయి కుమార్ ను ఎల్బీ నగర్ పోలీస్ లు కామినేని ఆసుపత్రి కి తరలించగా అప్పటికే సాయి కుమార్ మృతి చెందినట్లు వైద్యులు పోలీసులకు తెలిపారు. దీంతో ఘటన జరిగిన విషయాన్ని ఎల్బీ నగర్ పోలీస్ లు సాయి కుమార్ కుటుంభ సభ్యులకు సమాచారం అందించి మృతదేహాన్ని ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు.

**ఉన్నతాధికారుల వేధింపులే కారణం : కుటుంబ సభ్యులు**

సాయికుమార్ మృతిపై అతని తల్లి తండ్రులు విజయ, ఓడియ మరియు కుటుంబ సభ్యులు పోలీసులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఎల్బీ నగర్ పోలీస్ స్టేషన్ లో ఆందోళన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉన్నత అధికారుల వేధింపులు తట్టుకోలేకే సాయికుమార్ ఆత్మహత్యకు పాల్పడ్డాడని ,దీనిపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అదే విధంగా సాయి కుమార్ కుటుంబానీకి న్యాయం చేయాలని సుమారు 6 గంటలకు పైగా వారు ఆందోళన చేశారు.

**ఏసీపీ కార్యాలయంలో ఫర్నిచర్ ధ్వంసం...**

సాయికుమార్ మృతికి నిరసనగా ఎల్బీనగర్ పోలీస్‌స్టేషన్‌లో కుటుంబ సభ్యులు, బంధువుల ఆందోళన కొనసాగింది. ఈ క్రమంలో ఏసీపీ కార్యాలయంలోకి వెళ్లిన కొందరు కుటుంబ సభ్యులు అక్కడే టేబుల్ పై ఉన్న సిస్టమ్ ను ప్రింటర్‌తో పాటు ఇతర ఫర్నిచర్‌ను ధ్వంసం చేశారు. దీంతో పోలీసులకు, కుటుంబ సభ్యులకు మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో పోలీసులు భారీగా మోహరించారు.అంతే కాకుండా ఎలాంటి ఉద్రిక్త పరిస్థితులు తలెత్త కుండా ఎల్బీ నగర్ డీసీపీ అనురాధ , డీసీపీ రామేశ్వర్ తో పాటు వనస్థలి పురం ఏసీపీ కాశిరెడ్డి సీఐ లు పటిష్ట చర్యలు తీసుకున్నారు.

**ప్రభుత్వం ఆదుకుంటుంది: మల్ రెడ్డి రంగా రెడ్డి..**

ఎల్బీ నగర్ పోలీస్ స్టేషన్ లో సాయి కుమార్ ఆత్మహత్యకు కు పాల్పడిన విషయం తెలవగానే ఇబ్రహీం పట్నం ఎం ఎల్ ఏ మల్ రెడ్డి రంగా రెడ్డి, రాష్ట్ర రోడ్ రహదారుల కార్పొరేషన్ చైర్మన్ మల్ రెడ్డి రాం రెడ్డి లు పోలీస్ స్టేషన్ కు వచ్చి సాయి కుమార్ కుటుంబ సభ్యులనుఓదార్చి వారితో సంప్రదింపులు జరిపారు. అనంతరం ఎంఎల్ ఏ మల్ రెడ్డి మాట్లాడుతూ సాయి కుమార్ మృతి పట్ల తాము ప్రభుత్వం తరపున సానుభూతి వ్యక్తం చేస్తున్నామన్నారు. కానిస్టేబుల్ సాయి తన నియోజక వర్గ వ్యక్తి అని అందుకే వారి కుటుంబ సభ్యులకు డబల్ బెడ్ రూమ్ ఇళ్లు కేటాయిస్తామన్నారు. అలాగే సాయి తండ్రికి పెంచను కుటుంబం లో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం , 10 లక్షల ఆర్థిక సహాయం తో పాటు ప్రభుత్వం తరపున ఇంకా ఉన్న సరే అన్ని త్వరగా అందేలా చేస్తామన్నారు. కుటుంబ సభ్యులను త్వరలో సీఎం రేవంత్ రెడ్డి తో కలిసి విధంగా చూస్తామని తెలిపారు. దీంతో సాయి కుమార్ కుటుంబ సభ్యులు బంధువులు ఆందోళన విరమించి స్టేషన్ నుండి వెళ్లి పోయారు.

# బీజేపీ నాయకులు నిర్దోషులుగా విడుదల

**- సికింద్రాబాద్ కోర్టు తీర్పు**




**సికింద్రాబాద్: (ఆగస్టు 12). జర్నలిస్ట్ డైరీ.** 2019 సంవత్సరంలో గత బిఆర్ఎస్ ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా జరిగిన ఇంటర్మీడియట్ పరీక్ష పేపర్ల దిద్దుబాటులో ఘటనకు నిరసనగా , యువ మోర్చా ఆధ్వర్యంలో చేపట్టిన ఆందోళన కార్యక్రమంలో పెట్టిన అక్రమ కేసులో ఈరోజు సికింద్రాబాద్ 10వ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ కోర్టు బిజెపి నాయకులను నిర్దోషులుగా ప్రకటించింది.2019 లో ఇంటర్మీడియట్ పరీక్ష దిద్దుబాటులో వందలాది మంది విద్యార్థులు ఫెయిల్ అయ్యారు. ఫలితంగా పలువురు విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకున్నారు. ఈ ఘటనకు బాధ్యులైన గత బిఆర్ఎస్ ప్రభుత్వానికి, అప్పటి ముఖ్యమంత్రి కె.సి.ఆర్ కి వ్యతిరేకంగా సీతాఫల్మండి చౌరస్తాలో భాస్కర్ గిరి ఆధ్వర్యంలో యువ మోర్చా భారీ నిరసన కార్యక్రమం చేపట్టడం జరిగింది.ఆ నిరసనలో పాల్గొన్నందుకు రవి ప్రసాద్ గౌడ్. భాస్కర్ గిరి. తాటి భరత్. ప్రఫుల్. నవీన్.సందీప్. ల పై పోలీసులు అక్రమ కేసులు బనాయించారు. ఈ కేసు విచారణ నిమిత్తం ఈరోజు సికింద్రాబాద్ కోర్టుకు హాజరు కావడం జరిగింది.గౌ. న్యాయమూర్తి గారు సుదీర్ఘంగా జరిగిన విచారణ అనంతరం, సాక్ష్యాధారాలు లేకపోవడం మరియు ఆందోళన ప్రజాస్వామిక హక్కు అనే అంశాలను పరిగణలోకి తీసుకొని బిజెపి నాయకులందరినీ నిర్దోషులుగా ప్రకటించారు. ఈ కేసు గత 7 సంవత్సరాలుగా కొనసాగుతూ వచ్చింది.ఈ సందర్భంగా బిజెపి సికింద్రాబాద్ నియోజకవర్గ నాయకులు పి. రవి ప్రసాద్ గౌడ్ మాట్లాడుతూ, “విద్యార్థుల ఆత్మహత్యలకు కారణమైన బిఆర్ఎస్ ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని ప్రశ్నించినందుకు మాపై పెట్టిన అక్రమ కేసులో నేడు న్యాయం జరిగింది. నిజం ఎప్పటికీ నిలుస్తుంది. విద్యార్థుల భవిష్యత్తు కోసం, ప్రజల కోసం బిజెపి ఎప్పుడూ పోరాడుతుంది అని రవి ప్రసాద్ గౌడ్ అన్నారు.ప్రజాస్వామ్యంలో ప్రజల గొంతును నొక్కడానికి చేసే ఇలాంటి అక్రమ కేసులు ఎన్ని పెట్టినా బిజెపి కార్యకర్తలు వెనుకాడబోమని రవి ప్రసాద్ గౌడ్ స్పష్టం చేశారు. కేసు ను న్యాయవాది దిలీప్ కుమార్ వాదించడం జరిగింది.

# డీసీపీ రితీరాజ్‌ను కలిసిన టిడబ్ల్యుజెఎఫ్ నాయకులు




**కూకట్‌పల్లి, (ఆగస్టు 12). జర్నలిస్ట్ డైరీ.** కూకట్‌పల్లి జోన్ డీసీపీ రితీరాజ్‌ను తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టిడబ్ల్యుజెఎఫ్) మేడ్చల్ జిల్లా, కూకట్‌పల్లి నూతన కార్యవర్గ నాయకులు బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా డీసీపీ రితీరాజ్ నూతన కార్యవర్గ సభ్యులను అభినందించారు.శాంతిభద్రతల పరిరక్షణకు ప్రాధాన్యత ఇస్తామని, ఫ్రెండ్లీ పోలీసింగ్ కొనసాగిస్తూనే చట్టవిరుద్ధ కార్యకలాపాలపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. గుట్కా, గంజాయి విక్రయాలు, ఈవ్‌టీజింగ్‌ను అరికడతామని, అత్యవసర సమయంలో డయల్ 112కు సమాచారం ఇవ్వాలని సూచించారు.ఈ కార్యక్రమంలో టిడబ్ల్యుజెఎఫ్ నాయకులు కట్టెల మల్లేశం, అశోక్, ఎర్ర యాకయ్య, నాగుల అంజిబాబు, బొమ్మ గోపి, మహమ్మద్ షబ్బీర్, శ్యాంసుందర్, నవీన్ కుమార్, సైదులు, నాగరాజు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# ఈ69న్యూస్ సిఈవో భానుప్రసాద్ కు ఘన సన్మానం

**-ప్రైడ్ ఆఫ్ ఇండియా జాతీయ అవార్డుకు ఎంపిక పై హర్షం**
**- తమ్ముడపల్లి జి గ్రామంలో క్లాస్ మేట్ మిత్రులు ఘన సన్మానం**





**(జర్నలిస్ట్ డైరీ) : జఫర్‌ఘడ్, ఆగస్టు 12** జనగామ జిల్లా జఫర్‌ఘడ్ మండలం తమ్మడపల్లి(జి) గ్రామానికి చెందిన ఈ69 న్యూస్ సీఈఓ డాక్టర్ రాపర్తి భాను ప్రసాద్ జాతీయ స్థాయి ప్రతిష్ఠాత్మక ప్రైడ్ ఆఫ్ ఇండియా నేషనల్ అవార్డు--2026’కు ఎంపిక కావడంతో స్వగ్రామంలో చిన్ననాటి స్నేహితులు, పదో తరగతి వరకు కలిసి చదువుకున్న క్లాస్‌మేట్లు ఘనంగా సన్మానించారు.చిన్ననాటి నుంచే ప్రతిభ,పట్టుదల, సేవా భావంతో ముందుకు సాగిన భాను ప్రసాద్ నేడు జాతీయ స్థాయిలో గుర్తింపు పొందడం పట్ల మిత్రులు హర్షం వ్యక్తం చేశారు.మీడియా రంగంలో తనదైన ముద్ర వేయడంతో పాటు సామాజిక, సాంస్కృతిక రంగాల్లో విశేష సేవలందిస్తూ జాతీయ స్థాయిలో గుర్తింపు పొందడం తమ గ్రామానికే గర్వకారణమని కొనియాడారు.కష్టాలను అవకాశాలుగా మలుచుకుని నిరంతర శ్రమతో ఉన్నత స్థాయికి ఎదిగిన ఆయన ప్రస్థానం యువతకు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు.స్వగ్రామానికి, తాము చదువుకున్న పాఠశాలకు, చిన్ననాటి మిత్రబృందానికి మంచి పేరు తీసుకురావడం అభినందనీయమన్నారు.ఈ సందర్భంగా గ్రామస్తులు పలువురు డాక్టర్ రాపర్తి భాను ప్రసాద్‌ను అభినందించి, శాలువాతో సత్కరించారు.జాతీయ స్థాయి పురస్కారానికి ఎంపిక కావడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు.మన గ్రామం నుంచి జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన భాను ప్రసాద్ మరింత ఉన్నత స్థాయికి ఎదిగి, సమాజ సేవలో తన ప్రత్యేక ముద్ర వేయాలని గ్రామస్తులు ఆకాంక్షించారు.

## భారత ప్రభుత్వం దేశ సమగ్రత కోసం నిర్వహిస్తున్న

**-హర్ ఘర్ తిరంగా అభియాన్ కార్యక్రమాన్ని**




ఆగస్టు 12 (జర్నలిస్ట్ డైరీ) గోదావరిఖని న్యూస్
గోదావరిఖని ప్రభుత్వ జూనియర్ కళాశాల మరియు జిల్లా పరిషత్ గర్ల్స్ హైస్కూల్లో ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా హర్ ఘర్ తిరంగా అభియాన్ జిల్లా కన్వీనర్ కొండపర్తి సంజీవ్ కుమార్ సోమారపు లావణ్య మాట్లాడుతూ మువ్వన్నెల జెండాను దేశంలోని ప్రతి ఇంటికి చేర్చే విధంగా హర్ ఘర్ తిరంగా కార్యక్రమం నిర్వహిస్తున్నారని, దేశం కోసం ప్రాణాలర్పించిన స్వాతంత్ర సమరయోధుల స్ఫూర్తిని విద్యార్థి యువత కొనసాగించాలని పిలుపునిచ్చారు. అనంతరం వందేమాతరం మరియు జాతీయ గీతాన్ని విద్యార్థులతో పాడించి ఐక్యతను సమగ్రతను చాటడం జరిగింది. హర్ ఘర్ తిరంగా నియోజకవర్గ కన్వీనర్ పిడుగు కృష్ణ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో హర్ ఘర్ తిరంగా కమిటీ సభ్యులు కోమల్ల మహేష్, మేరుగు హనుమంత్ గౌడ్, సోమారపు లావణ్య, కాశీపేట శివాజీ, కందుల సంధ్యారాణి, చిలుక భారతి, జక్కుల నరహరి,సుల్వ లక్ష్మీ నరసయ్య, మాతంగి రేణుక, శ్రావణ్, అపర్ణ, మిట్టపల్లి సతీష్, గుండబోయిన భూమయ్య, ఆకాష్ గౌడ్, జనగామ శివరామకృష్ణ, కొమ్మల స్వామి యాదవ్, సిలువ పద్మ, మడికొండ శ్రీనివాస్, సిరి శెట్టి మల్లేష్,సిలివేరి అంజి, అంకార్ భరత్, శివ కుమార్, పంగ రవి, బుంగ మహేష్, మామిడి వీరేశం, బండారి శ్యామ్, వికాస్ తదితరులు పాల్గొన్నారు.

## జిఎం ఆఫీస్ వద్ద రోడ్డు ప్రమాదం

ఆగస్టు 12 (జర్నలిస్ట్ డైరీ) గోదావరి ఖని న్యూస్
గోదావరిఖని ఆర్ జీ వన్ జిఎం కార్యాలయం వద్ద రోడ్డు ప్రమాదం జరిగినది టీవీఎస్ ఎక్సెల్ మీద వెళుతున్న సింగరేణి కార్మికుడు ఎదురుగా వస్తున్న టాక్టర్ డి కొట్టడంతో అతని పరిస్థితి ఆందోళనకరంగా ఉంది స్థానిక సింగరేణి హాస్పిటల్ కు తరలిచ్చినారు గాయపడిన వ్యక్తిని సింగరేణి కార్మికుడిగా గుర్తించినారు.



## ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

**-మల్దకల్ లో ఉపాధ్యాయ సంఘాల ఆధ్వర్యంలో తహసీల్దార్ కు వినతిపత్రం అందజేత**



జోగులాంబ గద్వాల జిల్లా (జర్నలిస్ట్ డైరీ) ఆగస్టు 08:
ఉపాధ్యాయులు,పాఠశాలలు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని బుధవారం మల్దకల్ మండలం ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ (ఖుూజ) ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. మల్దకల్ మండలం ఉపాధ్యాయుల సంఘం నాయకులు పి.ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో మల్దకల్ తహసీల్దార్ కార్యాలయం తహసిల్దార్ ద్వారా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంలో వారు మాట్లాడుతూ....పిఆర్ సి అమలు, పెండింగ్ బకాయిల చెల్లింపు, 2003 డిఎస్సీ ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానం, సిపి ఎస్ రద్దు-- ఓపి ఎస్ పునరుద్ధరణ, ఉపాధ్యాయుల బదిలీలు--పదోన్నతులు, ఖాళీ పోస్టుల భర్తీ,టెట్ లో సర్వీస్ వెయిటేజీ తదితర డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించాలని కోరారు. అలాగే కేజీబివి సమగ్ర శిక్ష కాంట్రాక్ట్ ఉద్యోగుల సమస్యలు,జీవో 317 సమస్యను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. ఆందోళనల్లో భాగంగా నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన కొనసాగిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కృపేందర్,ఎస్.జయన్న,ప్రభాకర్, ఆనంద్ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను వేగవంతం చేయాలి

**-షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్**
**-ఇందిరమ్మ ఇళ్ల పురోగతిపై ఎమ్మెల్యే సమీక్ష సమావేశం నిర్వహించిన ఎమ్మెల్యే**



రంగారెడ్డి జిల్లా బ్యూరో, ఆగస్టు 12 (జర్నలిస్ట్ డైరీ)
మొదటి దశలో మంజూరైన 3,500 ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పురోగతిపై ఫరూఖ్ నగర్ పరిషత్ కార్యాలయంలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. మంజూరైన ఇళ్లలో 1,866 ఇళ్లు వివిధ దశల్లో నిర్మాణంలో ఉండగా, 948 ఇళ్లు పూర్తయ్యాయి. మరో 646 ఇళ్లు ఇప్పటికీ నిర్మాణం ప్రారంభం కాలేదు.
నిర్మాణం ప్రారంభం కాని 646 ఇళ్లపై గ్రామాల వారీగా సమీక్ష నిర్వహించిన ఎమ్మెల్యే, అతి త్వరలోనే అన్ని ఇళ్ల నిర్మాణ పనులు ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ...3,500 ఇళ్లు మంజూరు చేసినప్పటికీ ప్రజల అవసరాలకు అనుగుణంగా ఇది సరిపోదని, మరిన్ని ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయించేందుకు తన వంతు కృషి చేస్తానని తెలిపారు. క్షేత్రస్థాయిలో సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులతో సమన్వయం చేసుకుంటూ ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పురోగతిని మరింత వేగవంతం చేయాలని ఎంపీడీఓలను కోరారు. క్షేత్రస్థాయిలో ఏవైనా సమస్యలు ఎదురైతే మండల అధ్యక్షుల సహాయ సహకారాలు తీసుకుని పరిష్కరించుకోవాలని సూచించారు. లబ్ధిదారుల ఇళ్ల నిర్మాణ ప్రారంభ సమయంలో పంచాయతీ కార్యదర్శులు, హౌసింగ్ ఏఈలు మార్కౌట్ ఇచ్చి, అమలులో ఉన్న నిబంధనలను లబ్ధిదారులకు స్పష్టంగా వివరించి, ఇళ్ల నిర్మాణ ప్రక్రియలో అవసరమైన సహకారం అందించాలని ఎమ్మెల్యే సూచించారు.
తెలిసి తెలియక నిబంధనలకు మించి విస్తీర్ణంలో ఇళ్లు నిర్మించి, అనంతరం బిల్లులు మంజూరు కాక కార్యాలయాల చుట్టూ తిరిగే పరిస్థితి లబ్ధిదారులకు కల్పించవద్దని అధికారులను ఆదేశించారు. నిబంధనల ప్రకారం ఇళ్ల నిర్మాణం జరిగేలా ముందస్తుగా అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. అలాగే పైలట్ ప్రాజెక్ట్ గ్రామాల్లో పెండింగ్‌లో ఉన్న అన్ని బిల్లులను అతి త్వరలో మంజూరు చేయిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ సమీక్షా కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా హౌసింగ్ ప్రాజెక్ట్ డైరెక్టర్ డి.సి. నాయక్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సురేష్, మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్,అన్ని మండలాల ఏఈలు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు బాలరాజు గౌడ్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు శేఖర్ రెడ్డి, పురుషోత్తం రెడ్డి,రాయికల్ శ్రీనివాస్,రమేష్, సుదర్శన్ గౌడ్, శ్రీధర్,కుమార స్వామి గౌడ్,మున్సిపల్ కమిషనర్ సునీత తదితరులు పాల్గొన్నారు.

# లంబాడీలపై కుట్ర చేస్తే సహించేది లేదు

**-గోండు, గుత్తి కోయ నాయకులు నోటికొచ్చినట్లు మాట్లాడితే ఊరుకునేది లేదు**
**-రాంబల్ నాయక్, ఎల్ హెచ్ పి ఎస్ రాష్ట్ర అధ్యక్షులు.**



రంగారెడ్డి జిల్లా బ్యూరో, ఆగస్టు 12 (జర్నలిస్ట్ డైరీ);
లంబాడీలపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించేది లేదని లంబాడి హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు మూడవాత్ రాంబల్ నాయక్ హెచ్చరించారు. గిరిజన తెగల మధ్య విభేదాలు సృష్టించి రాజకీయ ప్రయోజనం పొందేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ఆయన ఆరోపించారు.బుధవారం ఆయన మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి సీతక్క ఆధ్వర్యంలో గోండు, గుత్తి కోయ ప్రజలను లంబాడీలకు వ్యతిరేకంగా రెచ్చగొట్టే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. లంబాడీ ఎమ్మెల్యేల సమావేశంలో ముఖ్యమంత్రి చేసినట్లు తాము పేర్కొంటున్న వ్యాఖ్యలు కూడా దీనికి నిదర్శనమని అన్నారు.ఆగస్టు 9న కొత్తగూడెం జిల్లా కేంద్రంలో ఆదివాసీ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన సభలో మంత్రి సీతక్క, కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధుల సమక్షంలో మైపతి అరుణ్‌కుమార్ ద్వారా లంబాడీలపై విమర్శలు చేయించారని రాంబల్ నాయక్ ఆరోపించారు. లంబాడీలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలనే డిమాండ్‌ను తెరపైకి తీసుకురావడం ద్వారా గిరిజన తెగల మధ్య చిచ్చు పెట్టే ప్రయత్నం జరుగుతోందని అన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత లంబాడీలకు మంత్రి పదవి ఇవ్వలేదని, గిరిజనుల స్వయం ఉపాధికి తగిన పథకాలు అమలు చేయలేదని విమర్శించారు. ఎన్నికల సమయంలో ప్రకటించిన ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్ హామీలను అమలు చేయాలని కోరితే, గిరిజన తెగల మధ్య విభేదాలు సృష్టించడం సరికాదన్నారు. గత ప్రభుత్వ హయాంలో సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకలను అధికారికంగా నిర్వహించిన విషయాన్ని గుర్తు చేసిన రాంబల్ నాయక్, గిరిజనుల హక్కులు, అభివృద్ధి కోసం అన్ని తెగలు ఐక్యంగా పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. "ఎమ్మెల్యే స్థానాల్లో ఎవరి వాటా ఎంత? ఎంపీ స్థానాల్లో ఎవరి వాటా ఎంత? విద్య, ఉద్యోగాలు, రాజకీయ రంగాల్లో జనాభా దామాషా ప్రకారం అన్ని గిరిజన తెగలకు న్యాయం జరగాలి. ఒకరి హక్కులను మరొకరు ప్రశ్నించకుండా, అందరం ఐక్యంగా మన హక్కుల కోసం పోరాడాలి" అని ఆయన అన్నారు.
గిరిజన తెగల మధ్య విభేదాలు సృష్టించి రాజకీయ పబ్బం గడుపుకోవాలని చూసే ప్రయత్నాలను ప్రజలు గమనించాలని పిలుపునిచ్చారు. లంబాడీల హక్కుల కోసం తమ పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని, లంబాడీలకు వ్యతిరేకంగా ఎవరైనా చౌకబారు వ్యాఖ్యలు చేస్తే తగిన రీతిలో స్పందిస్తామని రాంబల్ నాయక్ హెచ్చరించారు.

# డిజిటల్ అవగాహనతోనే సైబర్ నేరాలకు అడ్డుకట్ట

**- షాద్‌నగర్ పట్టణ సర్కిల్ ఇన్స్పెక్టర్ సీతారాం**



రంగారెడ్డి జిల్లా బ్యూరో, ఆగస్టు 12 (జర్నలిస్ట్ డైరీ) :
డిజిటల్ నేరాల పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండటంతోనే సైబర్ మోసాల నుంచి రక్షణ పొందవచ్చని షాద్‌నగర్ పట్టణ సర్కిల్ ఇన్స్పెక్టర్ సీతారాం తెలిపారు. షాద్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని చిన్నా చిల్కమర్రి గ్రామంలోని ఏం ఎస్ ఎన్ సంస్థ ప్రాంగణంలో ఉద్యోగులు, వర్కింగ్ ప్రొఫెషనల్స్ కోసం రెండో వారపు "సైబర్ నేరాల అవగాహన కార్యక్రమం" నిర్వహించారు. "ఫ్రాడ్ కా ఫుల్ స్టాప్" నినాదంతో డిజిటల్ భద్రత, ఆర్థిక మోసాల నివారణపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా సైబర్ నిపుణులు, పోలీస్ అధికారులు మాట్లాడుతూ ఉద్యోగులను లక్ష్యంగా చేసుకుని జరుగుతున్న వివిధ రకాల సైబర్ మోసాలపై వివరించారు. నకిలీ స్టాక్ మార్కెట్, ట్రేడింగ్ యాప్‌లు, అధిక లాభాల పేరుతో మోసపూరిత స్కీములు, అనధికార డిజిటల్ లోన్ యాప్‌లు, ఫిషింగ్ లింకుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. బ్యాంకింగ్, వ్యక్తిగత ఖాతాల భద్రత కోసం బలమైన పాస్‌వర్డ్‌లు వినియోగించాలని, టూ-ఫ్యాక్టర్ అథెంటికేషన్ (2ఎఫ్ఏ) తప్పనిసరిగా ఎనేబుల్ చేసుకోవాలని తెలిపారు. పబ్లిక్ వై-ఫై ద్వారా బ్యాంకింగ్ లావాదేవీలు చేయవద్దని, అనుమానాస్పద ఎస్ఎంఎస్ లు, వాట్సాప్ లింకులను క్లిక్ చేయకూడదని సూచించారు. మోసానికి గురైతే వెంటనే స్పందించాలి
సైబర్ మోసానికి గురైనప్పుడు ఆలస్యం చేయకుండా "గోల్డెన్ అవర్"లో స్పందించడం అత్యంత కీలకమని పోలీసులు తెలిపారు. బాధితులు వెంటనే 1930 జాతీయ సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్‌కు కాల్ చేసి ఫిర్యాదు చేయాలని, అలాగే cybercrime.gov.in లో అధికారికంగా ఫిర్యాదు నమోదు చేయాలని సూచించారు. వేగంగా ఫిర్యాదు చేయడం ద్వారా మోసపోయిన నగదును ఫ్రీజ్ చేసే అవకాశాలు మెరుగుపడతాయని వివరించారు. అనంతరం నిర్వహించిన ప్రశ్నోత్తరాల కార్యక్రమంలో ఉద్యోగులు అడిగిన యూపీఐ భద్రత, వర్క్ ఫ్రమ్ హోమ్ పేరుతో వచ్చే నకిలీ ఉద్యోగ ఆఫర్లు, ఐడెంటిటీ థెఫ్ట్ తదితర అంశాలపై అధికారులు సమాధానాలు ఇచ్చారు. ప్రతి ఒక్కరూ డిజిటల్ అవగాహన పెంచుకుని సైబర్ నేరగాళ్ల బారిన పడకుండా అప్రమత్తంగా ఉండాలని షాద్‌నగర్ పోలీసులు కోరారు.

జర్నలిస్ట్ డైరీ
తెలుగు దినపత్రిక

# కేపీహెచ్‌బీలో ఇందిరమ్మ టవర్స్‌కు నేడు సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా భూమిపూజ





**- క్యూర్ పరిధిలో రేపే ఇందిరమ్మ ఇండ్ల టవర్స్‌కు శ్రీకారం,క్యూర్ పరిధిలో ఏడాదిలో లక్ష ఇళ్ల నిర్మాణమే ప్రభుత్వ లక్ష్యం, ఏడాదిలో గృహప్రవేశాలు జరిగేలా ప్రణాళిక,అర్హులైన పేదలకు పారదర్శకంగా లక్కీడిప్ ద్వారా కేటాయింపు**

**రంగారెడ్డి జిల్లా బ్యూరో, ఆగస్ట్ 12 (జర్నలిస్ట్ డైరీ) :** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా నేడు అనగా ¯వసఱ: 13.8.26. గురువారం రోజున సాయంత్రం 4 గంటలకు కె.పి.హెచ్.బి 7,9, ఫేజ్ మరియు గోకుల్ ప్లాట్స్ మధ్యలో ఉన్న 5.87 ఎకరాల స్థలంలో పేదలకోసం రూ. 43 కోట్ల రూపాయల ఖర్చుతో 4 ఇందిరమ్మ టవర్ల భూమి పూజ కార్యక్రమం జరుగును. కమ్మ కార్పొరేషన్ ఛైర్మన్, టీపిసిసి ఉపాధ్యక్షులు బండి రమేష్, యాదవ కో ఆపరేటివ్ ఛైర్మన్ రఘునాథ్ యాదవ్, డీసీపీ రీతి రాజ్ మరియు ఇతర అధికారులతో కలిసి సభా ప్రాంగణం ఏర్పాట్లను పరిశీలించిన పియెసి ఛైర్మన్ ఆరెకపూడి గాంధీ. ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ... పేదల సొంతింటి కల సాకారానికి శిలాఫలకం పడబోతోంది. కె.పి.హెచ్.బి 7,9, ఫేజ్ మరియు గోకుల్ ప్లాట్స్ మధ్యలో ఉన్న 5.87 ఎకరాల స్థలంలో పేదలకోసం 43 కోట్ల ఖర్చుతో 4 టవర్లను నిర్మించనున్నారు. అత్యంత ఖరీదైన ఈ ప్రాంతంలో నిర్మించబోయే ఈ టవర్ల కు రేపు(గురువారం) మన ప్రియతమ ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి భూమిపూజ చేసి శిలాఫలకం ఆవిష్కరించనున్నారు, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పాల్గొందురు. ఒక ఏడాదిలో పూర్తి చేయాలని తలపెట్టిన ఈ ప్రాజెక్టు లో ఫేజ్ 1 కింద 480,ఫేజ్ 2 కింద 680 ఇళ్ళు నిర్మించనున్నారు అని తెలియచేశారు.క్యూర్ పరిధిలో ఇందిరమ్మ టవర్స్ నిర్మాణం హైదరాబాద్ గృహ నిర్మాణ రంగంలో ఒక కొత్త అధ్యాయానికి నాంది పలుకుతుంది.

హైదరాబాద్ మహానగరంలో ఎన్నో ఏళ్లుగా సొంతింటి కోసం ఎదురుచూస్తున్న నిరుపేద, మధ్యతరగతి కుటుంబాల కలను సాకారం చేసే దిశగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రజా ప్రభుత్వం మరో చారిత్రాత్మక అడుగు వేస్తోంది అని తెలియచేశారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేయనున్న ఐదు ఎకరాల ప్రాంతంలో నాలుగు టవర్స్ నిర్మించడం జరుగుతుంది. ఒక్కో టవర్‌లో 120 చొప్పున ఫ్లాట్స్ ఉంటాయి. ఒక్కో ఫ్లోర్‌లో 12 ఫ్లాట్స్ ఉండేలా 480 ఫ్లాట్స్ నిర్మాణం జరుగుతుంది. దీనికోసం 43.20 కోట్ల రూపాయిలు ఖర్చవుతుంది అని తెలియచేశారు.

ఇందిరమ్మ టవర్స్‌లో లబ్ధిదారులకు అందించే ఇళ్లు సౌకర్యవంతంగా, ఆధునిక ప్రమాణాలతో నిర్మించనున్నాం.

ప్రతిపాదిత ఇంటిలో ఒక బెడ్‌రూమ్, హాల్, కిచెన్‌తో కలిపి సుమారు 525 చదరపు అడుగుల విస్తీర్ణం ఉంటుంది అని తెలియచేశారు.

ప్రభుత్వ భూమిలో నిర్మిస్తున్న ఈ ఇళ్లలో లబ్ధిదారుడి పేరుతో అన్‌డివైడెడ్ షేర్ కింద సుమారు 20 నుంచి 25 గజాల స్థలాన్ని రిజిస్ట్రేషన్ చేయడం జరుగుతుంది.

హైదరాబాద్ నగరం నడిబొడ్డున పేదవాడి ఇంటికి పునాది వేయడం అంటే కేవలం ఒక భవనం నిర్మించడం కాదు.. ఒక కుటుంబానికి భద్రత, ఒక తరానికి భరోసా, పేదవాడికి గౌరవంతో కూడిన జీవితం అందించడమే.హైదరాబాద్‌లో భూముల ధరలు ఆకాశాన్ని తాకుతున్న నేపథ్యంలో నగరంలోనే సొంత ఇల్లు కావాలనే పేదల ఆకాంక్షను నెరవేర్చేందుకు ఇందిరమ్మ టవర్స్ నిర్మాణాలను ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపడుతుంది అని అన్నారు.

# ఒడిశా-హైదరాబాద్ గంజాయి సరఫరా నెట్‌వర్క్ భగ్నం


**ఇద్దరు అంతర్రాష్ట్ర స్మగ్లర్ల అరెస్టు.. 23.02 కిలోల గంజాయి, రెండు వాహనాలు స్వాధీనం**




**జర్నలిస్టు డైరీ, ఆగస్ట్ 12 నాగోలు:** ఒడిశా నుంచి హైదరాబాద్‌కు అక్రమంగా గంజాయి తరలిస్తున్న అంతర్రాష్ట్ర ముఠా గుట్టును ఎస్‌ఓటీ ఎల్‌బీనగర్ జోన్, నాగోలు పోలీసులు ఛేదించారు. ఇద్దరు గంజాయి స్మగ్లర్లను అరెస్టు చేసి వారి నుంచి 23.02 కిలోల గంజాయితో పాటు రెండు మొబైల్ ఫోన్లు, గంజాయి రవాణాకు ఉపయోగించిన రెండు కార్లను స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న గంజాయి విలువ సుమారు రూ.11.51 లక్షలు ఉంటుందని పోలీసులు తెలిపారు.

నాగోలు పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం ప్రకారం.. ఈ నెల 11న ఒడిశా నుంచి హైదరాబాద్‌కు రెండు వాహనాల్లో గంజాయి తరలిస్తున్నారన్న నమ్మదగిన సమాచారం ఎస్‌ఓటీ ఎల్‌బీనగర్ జోన్ బృందానికి అందింది. దీంతో నాగోలు పోలీసులతో కలిసి నాగోలు ఎక్స్‌రోడ్ సమీపంలోని భారత్ పెట్రోల్ పంప్ వద్ద వాహనాల తనిఖీలు చేపట్టారు.ఈ క్రమంలో అనుమానాస్పదంగా వచ్చిన AP31AJ3312 నంబర్ గల టయోటా ఇన్నోవా, OD05AX5899 నంబర్ గల మహీంద్రా ఓఖఎ300 వాహనాలను పోలీసులు అడ్డుకుని తనిఖీ చేశారు. ఇన్నోవా డిక్కీలో నాలుగు ప్యాకెట్లు, ఎక్స్‌యూవీ 300 డిక్కీలో రెండు ప్యాకెట్లలో దాచిన గంజాయిని గుర్తించారు. మొత్తం 23.02 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు.అరెస్టయిన వారిని ఒడిశా రాష్ట్రం కోరాపుట్ జిల్లాకు చెందిన లిత్రినాథ్ నిరికె (40), సోనా హుంతల్ (28)గా గుర్తించారు. ఇద్దరూ డ్రైవర్లుగా పనిచేస్తున్నారని పోలీసులు తెలిపారు. వీరు స్నేహితులని, ఆర్థిక ఇబ్బందుల కారణంగా గంజాయి రవాణాకు పాల్పడినట్లు విచారణలో వెల్లడైనట్లు పేర్కొన్నారు. కోరాపుట్ జిల్లా లాంప్తాపూర్ తహసీల్ పరిధిలోని మల్లిపాడ గ్రామానికి చెందిన 'కమ్ము' అనే వ్యక్తి సూచనల మేరకు గంజాయిని ఒడిశా నుంచి హైదరాబాద్‌కు తీసుకువచ్చినట్లు పోలీసులు తెలిపారు. హైదరాబాద్‌లోని వినియోగదారులకు గంజాయిని విక్రయించేందుకు నిందితులు రెండు వాహనాల్లో రహస్యంగా ప్యాకెట్లను తరలించినట్లు విచారణలో తేలింది. ఈ వ్యవహారంలో పరారీలో ఉన్న 'కమ్ము' కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. గంజాయి సరఫరా చైన్‌లో ఉన్న ఇతర వ్యక్తులను గుర్తించి అరెస్టు చేసేందుకు దర్యాప్తు కొనసాగుతోందని తెలిపారు.ఈ సందర్భంగా పోలీసులు మాట్లాడుతూ.. మాదకద్రవ్యాల సరఫరా వ్యవస్థను పూర్తిస్థాయిలో అడ్డుకునేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని తెలిపారు. విక్రేతలు, వినియోగదారులను గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని, మాదకద్రవ్యాలకు సంబంధించిన సమాచారం ప్రజలకు తెలిసిన వెంటనే పోలీసులకు తెలియజేసి సహకరించాలని కోరారు.ఈ ఆపరేషన్ మల్కాజిగిరి పోలీస్ కమిషనర్ బి. సుమతి (ఐపీఎస్) ప్రత్యక్ష పర్యవేక్షణలో, ఎల్‌బీనగర్ జోన్ డీసీపీ బి. అనురాధ (ఐపీఎస్), ఎస్‌ఓటీ డీసీపీ కె. మనోహర్, ఎస్‌ఓటీ ఎల్‌బీనగర్ జోన్ అదనపు డీసీపీ ఎండీ షాకీర్ హుస్సేన్, నాగోలు పీఎస్ ఇన్‌స్పెక్టర్ మక్బూల్ జానీ, ఎస్‌ఓటీ ఎల్‌బీనగర్ జోన్ ఇన్‌స్పెక్టర్ కె. ప్రతాప్ రెడ్డితో పాటు ఎస్‌ఓటీ, సరూర్‌నగర్ పోలీసు సిబ్బంది సహకారంతో విజయవంతంగా నిర్వహించినట్లు పోలీసులు తెలిపారు.

# నేటి నుంచి శ్రావణ మాసం ప్రారంభం..



**హైదరాబాద్ (ఆగస్టు 13) (జర్నలిస్ట్ డైరీ) :** హిందువులకు అత్యంత పవిత్రమైన శ్రావణ మాసం నేటి నుంచి ప్రారంభమైంది.ఈ సందర్భంగా జర్నలిస్ట్ డైరీ తో ప్రముఖ పురోహితులు శైలెంద్ర శర్మ పలు అంశాలు వివరించారు. ఈ శ్రావణమాసం లో శివకేశవులను భక్తిశ్రద్ధలతో ఆరాధించడం, వ్రతాలు, పూజలు, దానధర్మాలు నిర్వహించడం ద్వారా ఆధ్యాత్మిక చింతన పెంపొందుతుందని ఆయన తెలిపారు.శ్రావణమాసంలో శివారాధనతో పాటు శ్రీమహావిష్ణువు, లక్ష్మీదేవి ఆరాధనకు కూడా ప్రత్యేక ప్రాధాన్యత ఉందని పేర్కొన్నారు. ప్రతి సోమవారం శివుడికి అభిషేకాలు, బిల్వదళాలతో పూజలు, శివనామస్మరణ చేయడం ఆనవాయితీగా వస్తోందన్నారు. అలాగే విష్ణుమూర్తికి తులసీదళాలతో పూజలు, విష్ణు సహస్రనామ పారాయణం చేయడం ఎంతో శ్రేయస్కరమని తెలిపారు.శ్రావణ శుక్రవారాలు, మంగళగౌరీ వ్రతం, వరలక్ష్మీ వ్రతం వంటి పర్వదినాలకు ఈ మాసంలో ప్రత్యేక ప్రాధాన్యత ఉందని చెప్పారు. మహిళలు కుటుంబ సౌభాగ్యం, ఆరోగ్యం, ఐశ్వర్యం కోసం భక్తిశ్రద్ధలతో వ్రతాలు ఆచరిస్తారని వివరించారు."శివకేశవుల ఆరాధన ద్వారా భక్తి, ప్రశాంతత పెంపొందుతాయి. శ్రావణమాసంలో పూజలతో పాటు అన్నదానం, దానధర్మాలు, పేదలకు సహాయం వంటి సేవా కార్యక్రమాలు నిర్వహించడం మన సంప్రదాయంలోని గొప్ప విలువలను ప్రతిబింబిస్తుంది" అని శైలేంద్ర శర్మ తెలిపారు.శ్రావణమాస విశిష్టతను ప్రతి ఒక్కరూ తెలుసుకుని భక్తిశ్రద్ధలతో శివకేశవుల పూజలు నిర్వహిస్తూ ఈ పవిత్ర మాసాన్ని ఆధ్యాత్మికంగా సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

# తెలంగాణ రోడ్డు ప్రాజెక్టులకు త్వరితగతిన ఆమోదం ఇవ్వండి

**కేంద్ర రోడ్డు రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరిని కోరిన ఎంపీ మల్లు రవి**



**ఆమనగల్లుఆగస్టు12 (జర్నలిస్ట్ డైరీ)** తెలంగాణ రాష్ట్ర ఎంపీల ఫోరం రాష్ట్ర కన్వీనర్, నాగర్‌కర్నూల్ ఎంపీ, తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ క్రమశిక్షణ కమిటీ ఛైర్మన్ డాక్టర్ మల్లు రవి పార్లమెంట్ భవనంలో కేంద్ర రోడ్డు రవాణా,రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీని ఎంపీలతో కలిసి తెలంగాణలో కీలక రోడ్డు మౌలిక సదుపాయాల ప్రాజెక్టులకు సంబంధించి వినతిపత్రం సమర్పించారు. హైదరాబాద్ ప్రాంతీయ రింగ్ రోడ్ ఉత్తర భాగం (ఎన్‌హెచ్-161ఏఏ )కు త్వరితగతిన కేబినెట్ ఆమోదం ఇవ్వాలని,దక్షిణ భాగం అలైన్‌మెంట్‌కు ఆమోదం తెలిపి భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని కోరారు.అలాగే తెలంగాణకు బందర్ పోర్టుతో ప్రత్యక్ష, సమర్థవంతమైన అనుసంధానం కల్పించే హైదరాబాద్--అమరావతి--బందర్ పోర్ట్ గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్‌వేకు మంజూరు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ ప్రాంతంలోని సమస్యలను పరిష్కరిస్తూ ఎన్ హెచ్ -765పై మన్ననూర్ నుంచి శ్రీశైలం వరకు నాలుగు లేన్ల ఎలివేటెడ్ కారిడార్‌కు తక్షణ అనుమతి ఇవ్వాలని కోరారు. ఈ ప్రాజెక్టులు రాష్ట్ర రోడ్డు కనెక్టివిటీ, లాజిస్టిక్స్, ఆర్థిక అభివృద్ధికి ఎంతో దోహదపడతాయని మల్లు రవి పేర్కొన్నారు. ప్రాజెక్టులకు త్వరితగతిన ఆమోదం తెలిపి అమలు చేయాలని కేంద్ర మంత్రిని ఆయన కోరారు.

# ప్రొహిబిషన్ ఎక్సైజ్ స్టేషన్ ఆమనగల్లు పరిధిలో విస్తృత తనిఖీలు





**ఆమనగల్లు,ఆగస్టు12 (జర్నలిస్ట్ డైరీ)** ప్రొహిబిషన్ ఎక్సైజ్ స్టేషన్ ఆమనగల్లు పరిధిలోని నాలుగు మండలాల్లో ప్రజలకు మత్తు కలిగించే పదార్థాలను అక్రమంగా విక్రయిస్తున్నారా అనే అంశంపై అధికారులు విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు.ఇందులో భాగంగా కిరాణా దుకాణాలు, పాన్ షాపులు, ధాబాలు,హోటళ్లు తదితర ప్రాంతాల్లో తనిఖీలు చేపట్టారు. ధాబాలు, హోటళ్లలో అక్రమంగా మద్యం విక్రయించడం, అనుమతి లేకుండా మద్యం తాగించడం వంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడే వారిపై ఎక్సైజ్ చట్టాల ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు. అదేవిధంగా కిరాణా దుకాణాల్లో ప్రజలకు హానికరమైన మత్తు పదార్థాలను విక్రయించినా, అక్రమ సారా తయారీకి ఉపయోగించే బెల్లం, నల్లబెల్లం, పటిక తదితర పదార్థాలను అక్రమంగా నిల్వ ఉంచినా, విక్రయించినా సంబంధిత వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సీఐ బద్యనాద్ చౌహన్ హెచ్చరించారు. ఈ ప్రత్యేక తనిఖీల్లో భాగంగా కడ్తాల్ మండలం చరికొండ గ్రామం నుంచి అక్రమంగా సారా సరఫరా చేస్తున్న ఒక వ్యక్తిని అధికారులు అదుపులోకి తీసుకుని అరెస్టు చేశారు. అతని వద్ద నుంచి ఒక ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకోవడంతో పాటు సుమారు 8 లీటర్ల అక్రమ సారాను సీజ్ చేశారు.కార్యక్రమంలో సీఐ బద్యనాథ్ చౌహన్, ఎస్సై అరుణ్ కుమార్, చెన్నయ్య,రాంరెడ్డి, శ్రీను, లత, శివ ప్రసాద్, సాయి శ్రీజ తదితరులు పాల్గొన్నారు.

# ప్రైవేట్ ఆసుపత్రులను తనిఖీ చేసిన జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి



**మిడ్జిల్, ఆగస్టు 12, (జర్నలిస్ట్ డైరీ)** మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలో ప్రైవేటు ఆసుపత్రులు తనిఖీ చేసిన సాన్వి ఆసుపత్రి ,అభయప్రదఅస్పత్రి , మారుతి ఆసుపత్రి, వెన్నెల ఆసుపత్రి,ఆరోగ్య ఆసుపత్రి) తదితర ప్రైవేట్ ఆసుపత్రులను బుధవారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా. ఏ.శ్రీనివాసులు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రైవేట్ ఆసుపత్రులు అన్ని తప్పనిసరిగా వివిధ వైద్య సేవలకు తీసుకునే చార్జెస్ ను తప్పనిసరిగా తెలుగు మరియు ఇంగ్లిష్ భాషలలో ప్రదర్శించాలని ఆయన ఆదేశించారు. ఆసుపత్రి లో పని చేసే వైద్యులు, సిబ్బంది వివరాలను మారినప్పుడు ఆఫీసులో అప్డేట్ చేయించుకోవాలని ఆదేశించారు. బయోమెడికల్ వేస్ట్ మేనేజ్మెంట్ ఒప్పంద పత్రం, పొల్యూషన్ కంట్రోల్ సర్టిఫికెట్లు, ఫైర్ సేఫ్టీ ఆడిట్ రిపోర్ట్ లు లేని కొన్ని ఆసుపత్రులకు ఖచ్చితంగా సమర్పించాలని, లేనిచో క్లినికల్ ఎష్టబ్లిష్మెంట్ యాక్ట్ ప్రకారం జిల్లా కలెక్టర్ అనుమతితో తదుపరి చర్యలు తీసుకుంటామని అన్నారు. ఇట్టి కార్యక్రమం లో ప్రోగ్రాం అధికారి డా. రాజు, డా.పులి విద్య, హెల్త్ ఎడ్యుకేటర్ హన్మంతు, సుభాష్ చంద్ర తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్ట్ డైరీ
తెలుగు దినపత్రిక

## బిజినెస్

# రెండోరోజూ నష్టాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్..

### - సెన్సెక్స్ 187 పాయింట్లు పతనం

భారత స్టాక్ మార్కెట్లు వరుసగా రెండో రోజు కూడా నష్టాల్లోనే ముగిశాయి. బుధవారం సెన్సెక్స్ 187 పాయింట్లు నష్టపోగా, నిఫ్టీ 35 పాయింట్లు నష్టపోయింది. 30 షేర్ బీఎస్ఈ సెన్సెక్స్ ఉదయం 78,263.33 పాయింట్ల వద్ద లాభాల్లోనే ప్రారంభమైంది. కానీ, ఆ తర్వాత నష్టాల్లో సాగి, నష్టాల్లోనే ముగిసింది. అత్యధికంగా 78,263.33 పాయింట్లను చేరుకోగా, అత్యల్పంగా 77,497.93 పాయింట్లకు పడిపోయింది. ఒకే రోజు 765.51 పాయింట్ల నష్టాన్ని కనబర్చింది. చివరకు 187.90 పాయింట్లు (0.24 శాతం) నష్టంతో 77,966.35 వద్ద ముగిసింది. ఎన్ఎస్ఈ నిఫ్టీ కూడా నష్టాల బాటలోనే సాగింది. నిఫ్టీ 35.75 పాయింట్లు (0.15 శాతం) నష్టంతో 24,435.95 వద్ద ముగిసింది.అయితే, బ్రాడర్ మార్కెట్ మిశ్రమ ఫలితాలతో ముగిసింది. బీఎస్ఈ మిడ్‌క్యాప్ సెలెక్ట్ ఇండెక్స్ 31.16 పాయింట్లు (0.17 శాతం) లాభపడగా, బీఎస్ఈ స్మాల్‌క్యాప్ సెలెక్ట్ ఇండెక్స్ 0.39 శాతం లాభపడింది. మిడిల్ ఈస్ట్ యుద్ధం, అంతర్జాతీయ పరిణామాలు, క్రూడాయిల్ ధర పెరగడంతోపాటు టాటా గ్రూప్ స్టాక్స్ భారీ





అమ్మకాలకు పాల్పడటంతో మార్కెట్ నష్టాల బాటలో సాగింది. టాటా సన్స్ ఛైర్మన్ ఎన్.చంద్రశేఖరన్ రాజీనామా అంశం మార్కెట్‌పై దుష్ప్రభావం చూపింది. దీంతో టీసీఎస్ షేర్లు 4 శాతానికిపైగా నష్టపోయాయి. బీఎస్ఈ 30 షేర్ ఇండెక్స్‌లో ఎస్బీఐ, అల్ట్రా సిమెంట్, పవర్ గ్రిడ్, భారతి ఎయిర్‌టెల్, రిలయన్స్ సంస్థల షేర్లు లాభాల్లో సాగాయి. ఏసియన్ పెయింట్స్, హెచ్‌సీఎల్‌టెక్, అదానీ పోర్ట్స్, టైటాన్, బజాజ్ ఫిన్‌సర్వ్ షేర్లు నష్టపోయాయి. అంతర్జాతీయంగా బ్రెంట్ క్రూడాయిల్ బ్యారెల్ ధర 89 డాలర్ల వద్ద కొనసాగుతోంది. బంగారం ఔన్స్ ధర రూ.4,417.97 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. రూపాయితో డాలర్ మారకం విలువ 95.33గా ఉంది. అంతర్జాతీయ మార్కెట్లకు సంబంధించి ఆసియా మార్కెట్లు ఎక్కువగా లాభాల్లోనే కొనసాగాయి. దక్షిణ కొరియాకు చెందిన కోస్పి ఏకంగా 4.59 శాతం పెరిగింది. జపాన్ నిక్కీ 225 పాయింట్లు పెరిగింది. షాంగై ఎస్ఎస్ఈ కాంపోజిట్ ఇండెక్స్ కూడా లాభాల్లోనే ముగిసింది. హాంకాంగ్‌కు చెందిన సెంగ్ ఇండెక్స్ మాత్రం నష్టాల్లో ముగిసింది. అమెరికా మార్కెట్లు కూడా బుధవారం నష్టాల్లోనే ముగిశాయి.

## టీవీఎస్ అపాచీ బైకుల ధరల పెంపు!



ప్రముఖ తయారీ సంస్థ టీవీఎస్ అపాచీ RTR 160 2V, 4V స్పోర్టీ బైక్ శ్రేణిపై స్వల్పంగా ధరలను పెంచుతూ నిర్ణయం తీసుకుంది. ఈ ధరల పెంపుతో కొనుగోలుదారులపై మరింత భారం పడనుంది. టీవీఎస్ అపాచీ RTR 160 2V సిరీస్‌లో అత్యవసర వేరియంట్లపై సుమారు ఐదు వందల రూపాయల వరకు ధర పెరిగింది. టీవీఎస్ అపాచీ RTR 160 4V మోడల్‌లో వేరియంట్‌ను బట్టి ఈ పెంపు భిన్నంగా అమలు చేయబడింది. డ్యూయల్ ఛానల్ ఏబీఎస్‌తో కూడిన యూఎస్‌డీ వేరియంట్‌పై గరిష్టంగా ఆరు వందల రూపాయల వరకు పెరిగింది.

### ఫోక్స్‌వ్యాగన్ వర్టస్ స్పెషల్ ఎడిషన్‌లో కొత్త ఫీచర్లు



ప్రముఖ బ్రాండ్ ఫోక్స్‌వ్యాగన్, వర్టస్ సెడాన్ నాలుగేళ్ల ప్రయాణాన్ని పురస్కరించుకుని సరికొత్త హంగులతో యానివర్సరీ ఎడిషన్‌ను మార్కెట్లోకి తెచ్చింది. 360 డిగ్రీల కెమెరా, వెంటిలేటెడ్ సీట్లు, 10-అంగుళాల టచ్‌స్క్రీన్ వంటి అధునాతన ఫీచర్లు ఉన్నాయి. 1.5 లీటర్ టీఎస్ఐ టర్బో-పెట్రోల్ ఇంజిన్‌తో 7-స్పీడ్ డీఎస్‌జీ ఆటోమేటిక్ గేర్‌బాక్స్‌తో వస్తున్న ఈ కారులో ఆరు ఎయిర్‌బ్యాగ్‌లు, ఎలక్ట్రానిక్ స్టెబిలిటీ కంట్రోల్ వంటి భద్రతా ఫీచర్లున్నాయి. కేవలం 150 యూనిట్లు మాత్రమే అందుబాటులో ఉన్న ఈ కారు ధర సుమారు రూ.19.20 లక్షలు.

# మళ్లీ పెరిగిన బంగారం ధరలు

బంగారం ధరలు వినియోగదారులకు మళ్లీ షాక్ ఇచ్చాయి. హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో బుధవారం భారీగా పెరిగాయి. 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. 1,040 పెరిగి రూ.1,54,860కి చేరింది. 22 క్యారెట్ల 10 గ్రాముల పసిడి ధర రూ.950 ఎగిసి రూ.1,41,950 పలుకుతోంది. కేజీ వెండి ధర రూ.2,60,100 వద్ద కొనసాగుతోంది. తెలుగు రాష్ట్రాల్లో నగరాన్ని బట్టి వీటి ధరల్లో స్వల్ప తేడాలు ఉండొచ్చు.



# కుల్‌దీప్‌ను సరిగ్గా హ్యాండిల్ చేయండి..

భారత స్టార్ చైనామన్ స్పిన్నర్ కుల్‌దీప్ యాదవ్‌ను టీమ్ మేనేజ్‌మెంట్ సరిగ్గా ఉపయోగించుకోవట్లేదనే ఆందోళన మాజీ క్రికెటర్లలో తీవ్రమవుతోంది. 15 మందిలో ఉంటున్నప్పటికీ అతడికి తుది జట్టులో మాత్రం ఆడే అవకాశం రావట్లేదు. ఇటీవల ఇంగ్లాండ్‌తో ముగిసిన మూడు వన్డేల సిరీస్‌లోనూ అతడు బెంచ్‌కే పరిమితమయ్యాడు. ఈ నేపథ్యంలో శ్రీలంకతో టెస్ట్ సిరీస్‌కు ముందు కుల్‌దీప్‌ను ఉద్దేశించి.. టీమిండియా మాజీ స్పిన్నర్ మురళీ కార్తిక్ కీలక వ్యాఖ్యలు చేశాడు.రోహిత్ శర్మ, ద్రవిడ్ హయాంలో కుల్‌దీప్‌ను ఒక అసలైన మ్యాచ్ విన్నర్‌గా చూస్తూ పూర్తి స్వేచ్ఛ, భరోసా ఇచ్చారని గుర్తు చేశాడు. ప్రస్తుత హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ సైతం అదే బాటలో ఈ స్పిన్నర్ విషయంలో అలాంటి నిర్ణయాలే తీసుకోవాలని హితవు పలికాడు. కాగా రాహుల్ ద్రవిడ్ కోచింగ్ హయాంలో (2021 నవంబర్ నుంచి 2024 జూన్ వరకు) కుల్‌దీప్ అన్ని ఫార్మాట్లలో కలిపి నెలకు సగటున 2 మ్యాచ్‌ల చొప్పున 60 మ్యాచ్‌లు ఆడాడు. అయితే గంభీర్ బాధ్యతలు స్వీకరించిన తర్వాత ఈ సగటు నెలకు 1.5 మ్యాచ్‌లకు (38 మ్యాచ్‌లు) పడిపోయింది. ముఖ్యంగా ఇటీవల ఇంగ్లాండ్‌తో జరిగిన వన్డే సిరీస్‌లో కుల్‌దీప్‌ను కాదని నలుగురు పేసర్లతో బరిలోకి దిగడం అతని ఆత్మవిశ్వాసాన్ని దెబ్బతీసేలా




మారిందని విశ్లేషకులు భావిస్తున్నారు. కుల్‌దీప్ పట్ల ప్రస్తుత మేనేజ్‌మెంట్ వ్యవహరిస్తున్న తీరుపై సీనియర్ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ కూడా తన యూట్యూబ్ ఛానెల్‌లో బహిరంగంగానే అసంతృప్తి వ్యక్తం చేయడం గమనార్హం.గంభీర్ హయాంలో బౌలింగ్ పదును కంటే బ్యాటింగ్ డెప్త్‌కు ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వడంపై మురళీ కార్తీక్ అభ్యంతరం వ్యక్తం చేశాడు. టెస్టు మ్యాచ్ గెలవాలంటే ప్రత్యర్థి 20 వికెట్లు తీయడం అత్యంత కీలకమని వ్యాఖ్యానించాడు. కేవలం బ్యాటింగ్ డెప్త్ కోసం బౌలింగ్‌ను బలహీనపర్చకూడదని పేర్కొన్నాడు. కుల్‌దీప్ బ్యాట్‌తో ఏమీ అసమర్థుడు కాదని, నైట్‌వాచ్‌మన్‌గా ఎన్నోసార్లు ఎక్కువ సేపు క్రీజులో నిలబడిన సందర్భాలు ఉన్నాయని గుర్తు చేశాడు. జడేజా, అశ్విన్ వలె భారీ హిట్టింగ్ చేయలేకపోయినా, ఒక ప్రామాణిక స్పిన్ బౌలర్‌గా ప్రపంచంలో ఎక్కడైనా వికెట్లు తీయగల సత్తా కుల్‌దీప్‌కు ఉందని కొనియాడాడు. తుది జట్టులో తన స్థానం ఖాయమనే భరోసా కల్పించినపుడే ఆటగాళ్లు అత్యుత్తమ ప్రదర్శన కనబరుస్తారని ఈ సందర్భంగా మురళీ కార్తిక్ చెప్పుకొచ్చాడు.

# భారత గడ్డపై టీమిండియాకు ఆతిథ్యం ఇవ్వనున్న అఫ్గానిస్థాన్..

### భారత్-అఫ్గాన్ టీ20 షెడ్యూల్ విడుదల
### సెప్టెంబర్ 13 నుంచి 3 మ్యాచ్‌ల సిరీస్ షురూ
### ఢిల్లీలోని అరుణ్ జైట్లీ స్టేడియంలో మ్యాచ్‌లు


భారత్, అఫ్గానిస్థాన్ క్రికెట్ జట్ల మధ్య మరో రసవత్తర సమరానికి రంగం సిద్ధమైంది. అఫ్గానిస్థాన్ హోస్ట్ చేసే మూడు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌కు ఢిల్లీలోని ప్రతిష్టాత్మక అరుణ్ జైట్లీ క్రికెట్ స్టేడియం ఆతిథ్యమివ్వనుందని అఫ్గానిస్థాన్ క్రికెట్ బోర్డు, బీసీసీఐ సంయుక్తంగా వెల్లడించాయి. సెప్టెంబర్ 13న తొలి టీ20, సెప్టెంబర్ 15న రెండో టీ20, సెప్టెంబర్ 17న మూడో టీ20 మ్యాచ్‌లు ఒకే వేదికపై జరగనున్నాయి. అఫ్గానిస్థాన్ తమ స్వదేశీ సిరీస్‌లను భారత్, యూఏఈలలో ఆడుతున్న నేపథ్యంలో, ఈ ద్వైపాక్షిక సిరీస్‌కు భారత్‌నే హోస్ట్ వేదికగా ఎంచుకుంది.అఫ్గానిస్థాన్‌లో క్రికెట్ అభివృద్ధికి బీసీసీఐ ఎల్లప్పుడూ సంపూర్ణ మద్దతు ఇస్తుందని బీసీసీఐ అధ్యక్షుడు మిథున్ మన్హాస్ తెలిపారు. నాణ్యమైన ప్రత్యర్థి జట్లతో ద్వైపాక్షిక



మ్యాచ్‌లు ఆడటం వల్ల అఫ్గాన్ ఆటగాళ్లకు అంతర్జాతీయ స్థాయిలో విలువైన అనుభవం లభిస్తుందని పేర్కొన్నారు. భారత అభిమానుల్లో అఫ్గాన్ ఆటగాళ్లకు ఉన్న ఆదరణ ఇరు దేశాల క్రికెట్ అనుబంధాన్ని మరింత బలోపేతం చేసిందని బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా పేర్కొన్నారు. 2018లో అఫ్గాన్ తొలి చారిత్రక టెస్టుకు ఆతిథ్యమిచ్చిన భారత్, ఇటీవలే జూన్‌లో టెస్ట్, వన్డే సిరీస్‌లను నిర్వహించిన సంగతిని ఆయన గుర్తుచేశారు. ఢిల్లీ అండ్ డిస్ట్రిక్ట్ క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు రోహన్ జైట్లీ ఈ సిరీస్ పట్ల హర్షం వ్యక్తం చేశారు. అరుణ్ జైట్లీ స్టేడియంలో ఇరు జట్లకు అత్యుత్తమ వసతులు కల్పిస్తామని, ఢిల్లీ క్రికెట్ అభిమానులకు ఈ మూడు టీ20 మ్యాచ్‌లు సరికొత్త వినోదాన్ని అందిస్తాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సిరీస్ అఫ్గానిస్థాన్ క్రికెట్‌కు ఎంతో కీలకమని ఏసీబీ చైర్మన్ మిర్వైస్ అష్రఫ్ పేర్కొన్నారు. బీసీసీఐతో ఉన్న దీర్ఘకాలిక సంబంధాల్లో ఇది మరో కీలక ముందడుగు అని, భారత్ వేదికగా ఈ సిరీస్ నిర్వహించడం ద్వారా వాణిజ్య, సాంకేతిక, క్రీడా రంగాల్లో తమకు ఎంతో లబ్ధి చేకూరుతుందని తెలిపారు. కాగా బీసీసీఐ, ఏసీబీ ప్రకటనతో బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డుకు షాక్ తగిలినట్లయింది. ఎందుకంటే ఆ దేశ క్రికెట్ బోర్డు.. తమతో సిరీస్ ఆడేందుకు భారత్.. బంగ్లాదేశ్ వస్తుందని ఆశలు పెట్టుకుంది. కానీ తాజా షెడ్యూల్ ప్రకటన చూస్తే.. బంగ్లాదేశ్ పర్యటనకు తాము వెళ్లడం లేదని బీసీసీఐ చెప్పేసినట్లయింది.

## స్పోర్ట్స్

# పెళ్లి చేసుకున్న ఫుట్‌బాల్ స్టార్ క్రిస్టియానో రోనాల్డో



**లిస్బన్**

పోర్చుగల్ ఫుట్‌బాల్ స్టార్ క్రిస్టియానో రోనాల్డో పెళ్లి చేసుకున్నాడు. పదేళ్లుగా కలిసి జీవిస్తున్న తన ప్రియురాలు జార్జియానా రోడ్రిగేజ్‌ను అతను మ్యారేజ్ చేసుకున్నాడు. ఆ జోడీ ఇప్పుడు అధికారికంగా భార్యాభర్తలు అయ్యారు. రాజధాని లిస్బన్‌కు సమీపంలో ఉన్న కాస్‌కేయస్ అనే కోస్టల్ పట్టణంలో పెళ్లి వేడుక జరిగింది. ఈ మ్యారేజీకి అతని అయిదుగురు పిల్లలు కూడా హాజరయ్యారు. రింగులు మార్చుకున్న పిక్స్‌ను ఆ ఇద్దరూ తమ ఇన్‌స్టాగ్రామ్ అకౌంట్లలో పోస్టు చేశారు.మాడ్రిడ్‌లో కలుసుకున్న ఆ జోడీ గత పదేళ్లుగా కలిసి ఉంటోంది. క్రిస్టియానో రోనాల్డో వయసు 41 ఏళ్లు. అయిదు సార్లు అతను బెస్ట్ ఫుట్‌బాల్ ప్లేయర్ అవార్డును గెలుచుకున్నాడు. క్రీడారంగంలో హై ప్రొఫైల్ స్టార్‌గా నిలిచాడు. ఇటీవల అమెరికా వేదికగా జరిగిన ఫుట్‌బాల్ వరల్డ్‌కప్‌లోనూ అతను ఆడాడు. రికార్డు స్థాయిలో ఆరోసారి అతను వరల్డ్‌కప్‌లో ప్రాతినిధ్యం వహించాడు.

జర్నలిస్ట్ డైరీ
తెలుగు దినపత్రిక



## గ్లామర్ డోస్ పెంచేసిన కళ్యాణి ప్రియదర్శన్.. కుర్రాళ్లు ఫ్లాట్

# మాస్ మహారాజా రవితేజ 'ఇరుముడి' ట్రైలర్ వచ్చేసింది..

### ఆగస్టు 21న గ్రాండ్ రిలీజ్!




మాస్ మహారాజా రవితేజ హీరోగా టాలెంటెడ్ డైరెక్టర్ శివ నిర్వాణ దర్శకత్వంలో తెరకెక్కుతున్న మోస్ట్ అవేటెడ్ మూవీ 'ఇరుముడి' ట్రైలర్ తాజాగా ప్రేక్షకుల ముందుకు వచ్చింది. పశ్చిమ గోదావరి జిల్లా భీమవరంలోని ఎస్.ఆర్.కె.ఆర్. ఇంజనీరింగ్ కాలేజీలో అత్యంత భారీ స్థాయిలో నిర్వహించిన ప్రత్యేక లాంచ్ ఈవెంట్‌లో చిత్ర యూనిట్ ఈ ట్రైలర్‌ను విడుదల చేసింది.ట్రైలర్ ఆద్యంతం సినిమాపై భారీ అంచనాలను పెంచేలా ఉంది. రవితేజను ఇప్పటివరకు ఎన్నడూ చూడని సరికొత్త డిఫరెంట్ వేరియేషన్‌లో ఈ చిత్రంలో చూపించబోతున్నట్లు ట్రైలర్ స్పష్టం చేస్తోంది. ఒకవైపు అదిరిపోయే మాస్ యాక్షన్ ఎలిమెంట్స్, మరోవైపు తండ్రీకూతుళ్ల మధ్య ఉండే హృదయానికి హత్తుకునే ఎమోషనల్ బాండింగ్, అలాగే కథకు తగ్గట్టుగా జోడించిన డివైన్ టచ్ ప్రేక్షకులను విపరీతంగా ఆకట్టుకుంటున్నాయి. ఈ చిత్రంలో రవితేజ సరసన ప్రియా భవానీ శంకర్ హీరోయిన్‌గా నటిస్తుండగా, సాయి కుమార్, బేబీ నక్షత్ర, అజయ్ ఘోష్ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. టాలెంటెడ్ మ్యూజిక్ డైరెక్టర్ జి.వి. ప్రకాశ్ కుమార్ ఈ సినిమాకు అద్భుతమైన బాణీలు అందిస్తున్నారు. ప్రముఖ నిర్మాణ సంస్థలు మైత్రీ మూవీ మేకర్స్ మరియు టీ-సిరీస్ సంయుక్తంగా అత్యంత భారీ బడ్జెట్‌తో ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నాయి. అన్ని కార్యక్రమాలను పూర్తి చేసుకున్న ఈ సినిమా, ప్రపంచవ్యాప్తంగా ఆగస్టు 21న గ్రాండ్‌గా థియేటర్లలో విడుదల కానుంది.

# జాన్వీ కపూర్ పర్సనాలిటీ రైట్స్ కేసు..


### అసభ్యకర కంటెంట్ తొలగించాలంటూ ఢిల్లీ హైకోర్టు ఆదేశం!

ప్రముఖ బాలీవుడ్ నటి జాన్వీ కపూర్ తన వ్యక్తిత్వ హక్కుల (పర్సనాలిటీ రైట్స్) పరిరక్షణ కోసం ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించారు. తన పేరు, ఫొటోలు, వీడియోలను అడ్డుపెట్టుకుని సోషల్ మీడియాలో అసభ్యకరమైన పోస్టులు, AI ద్వారా సృష్టించిన డీప్‌ఫేక్ వీడియోలను ప్రచారం చేస్తున్నారని ఆమె తరఫు న్యాయవాది కోర్టులో వాదించారు. అయితే ఈ పిటిషన్‌పై విచారణ జరిపిన ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ అనూప్ జైరామ్ భంభాని కీలక ఆదేశాలు జారీ చేశారు. అసభ్యకరంగా ఉన్న కంటెంట్‌ను, అలాగే ఎవరైనా ఆమె పేరును వాణిజ్యపరంగా దుర్వినియోగం చేస్తుంటే ఆ పోస్టులను తక్షణమే తొలగించాలని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ.. పర్సనాలిటీ రైట్స్ అనే భావనకు ఒక సరైన హద్దు ఉండాలని, సెలబ్రిటీల హక్కులను రక్షించడంతోపాటు భావప్రకటన స్వేచ్ఛను కూడా సమతుల్యం చేయాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా అన్ని ఫ్యాన్ పేజీలపై ఒకేసారి నిషేధం విధించలేమని కోర్టు పేర్కొంది. కేవలం వాణిజ్య ప్రయోజనాల కోసం లేదా డబ్బు సంపాదనే లక్ష్యంగా ఎవరైనా ఆమె పేరును వాడుకుంటేనే కచ్చితంగా చర్యలు తీసుకోవచ్చునని, అయితే అన్ని ఫ్యాన్ పేజీలను నేరపూరితమైనవిగా పరిగణించలేమని తెలిపారు. కొందరు వ్యంగ్యంగా లేదా విమర్శనాత్మక ధోరణిలో కూడా పోస్టులు చేసే అవకాశం ఉందని న్యాయమూర్తి గుర్తుచేశారు. ఈ కేసులో మెటా తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. పిటిషనర్ తరఫున ఇప్పటికే 4,000కు పైగా యూఆర్ఎల్‌లను సమర్పించారని, అయితే ఆ కంటెంట్ అంతా ఒకేలా అభ్యంతరకరంగా లేదని కోర్టు దృష్టికి తెచ్చారు. దీంతో, ఆరోపణలు ఎదుర్కొంటున్న కంటెంట్‌ను స్పష్టమైన వర్గాలుగా విభజించి తదుపరి విచారణకు కోర్టు ముందుంచాలని పిటిషనర్ తరఫు న్యాయవాదిని న్యాయమూర్తి ఆదేశించారు. గతంలో కూడా పలువురు ప్రముఖ నటీనటులు, క్రీడాకారులు, రాజకీయ నాయకులు తమ వ్యక్తిత్వ హక్కుల రక్షణ కోసం ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించిన విషయం తెలిసిందే



# ఇండియన్ బాక్సాఫీస్ వద్ద 'స్పైడర్ మ్యాన్' విధ్వంసం..

### 12 రోజుల్లోనే రూ. 500 కోట్ల కలెక్షన్స్!





హాలీవుడ్ సూపర్ హీరో ఫ్రాంచైజీ 'స్పైడర్ మ్యాన్' సిరీస్ నుంచి వచ్చిన తాజా చిత్రం 'స్పైడర్ మ్యాన్: బ్రాండ్ న్యూ డే' ఇండియన్ బాక్సాఫీస్ వద్ద సరికొత్త వసూళ్లతో దూసుకుపోతోంది. టామ్ హాలండ్, జెండాయా జంటగా నటించిన ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగానే కాకుండా, మన దేశంలోనూ ఊహించని రీతిలో వసూళ్ల సునామీ సృష్టిస్తోంది. ఇప్పటికే ప్రపంచవ్యాప్తంగా రూ. 12,000 కోట్లకు పైగా వసూళ్లను రాబట్టిన ఈ చిత్రం, ఇండియన్ బాక్సాఫీస్ వద్ద కూడా అదే జోరును ప్రదర్శిస్తోంది. తాజాగా ఈ సినిమా తెలుగు, హిందీ, తమిళ, ఇంగ్లీష్ భాషల్లో కలిపి భారతీయ మార్కెట్‌లో రూ. 500 కోట్లకు పైగా గ్రాస్ వసూళ్లను సాధించింది.దీంతో మార్వెల్ సినిమాటిక్ యూనివర్స్ సినిమాలకు భారతదేశంలో ఉన్న క్రేజ్ మరోసారి నిరూపితమైంది. వీకెండ్‌లోనే కాకుండా వీక్‌డేస్‌లో కూడా థియేటర్లు హౌస్‌ఫుల్ బోర్డులతో కళకళలాడుతున్నాయి. రెండో వారంలోనూ వసూళ్ల జోరు ఏమాత్రం తగ్గకపోగా, మొత్తం గ్రాస్ కలెక్షన్లు త్వరలోనే రూ. 520 కోట్లకు చేరుకుంటాయని ట్రేడ్ వర్గాలు వెల్లడించాయి. త్వరలో కొన్ని కొత్త చిత్రాలు విడుదల కానున్నప్పటికీ, వాటిని తట్టుకుని ఈ సినిమా ఫుల్ రన్‌లో సులభంగా రూ. 600 కోట్ల గ్రాస్ మరియు రూ. 500 కోట్ల నెట్ వసూళ్లను సాధిస్తుందని విశ్లేషకులు భావిస్తున్నారు. ఇప్పటివరకు భారతదేశంలో ఈ సినిమాను దాదాపు 1.7 కోట్ల మంది ప్రేక్షకులు వీక్షించారు. త్వరలోనే ఈ సంఖ్య 2 కోట్లకు చేరుకునే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. గతంలో మన దేశంలో హాలీవుడ్ నుంచి కేవలం 'టైటానిక్', 'అవెంజర్స్: ఎండ్‌గేమ్' చిత్రాలను మాత్రమే 2 కోట్ల మందికి పైగా థియేటర్లలో చూశారు. ఇప్పుడు 'స్పైడర్ మ్యాన్: బ్రాండ్ న్యూ డే' కూడా ఆ అరుదైన రికార్డుకు చేరువలో దూసుకుపోతోంది. ఈ విజయంతో ట్రేడ్ పండితులు దీన్ని 'ఆల్ టైమ్ బ్లాక్‌బస్టర్'గా ప్రకటించారు.

# వెండితెరపైకి అసలైన నేర సామ్రాజ్యం..

### అంచనాలు పెంచేస్తున్న 'మిర్జాపూర్: ది మూవీ' ట్రైలర్!

భారతీయ ఓటీటీ చరిత్రలో సంచలనం సృష్టించడంతో పాటు అత్యంత ప్రజాదరణ పొందిన క్రైమ్ డ్రామా వెబ్ సిరీస్ 'మిర్జాపూర్' ఇప్పుడు వెండితెరపై అలరించేందుకు సిద్ధమైంది. అమెజాన్ ఎమ్‌జీఎం స్టూడియోస్ మరియు ఎక్సెల్ ఎంటర్‌టైన్‌మెంట్ పతాకాలపై రితేష్ సిధ్వాని, ఫర్హాన్ అక్తర్ సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. సెప్టెంబర్ 04న ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రాబోతుండగా తాజాగా ఈ సినిమాకు సంబంధించిన అధికారిక ట్రైలర్ విడుదల చేశారు మేకర్స్. ఈ చిత్రానికి గుర్‌మీత్ సింగ్ దర్శకత్వం వహిస్తుండగా, సిరీస్‌లో అదరగొట్టిన ప్రధాన నటీనటులందరూ మళ్లీ పెద్ద తెరపై తమ విశ్వరూపం చూపించడానికి వస్తున్నారు.సింహాసనం అనేది రాజకీయాల ద్వారా రాదు, అలా అని వంశపారంపర్యంగానూ రాదు... కేవలం బాహుబలం ఉంటేనే సింహాసనం దక్కుతుంది అనే పవర్‌ఫుల్ డైలాగ్‌తో ట్రైలర్ ఆకట్టుకుంటుంది. ఓటీటీలో వెబ్ సిరీస్‌గా ప్రేక్షకులను అలరించిన ఈ నేర ప్రపంచాన్ని, మరింత భారీ హంగులతో, అత్యున్నత నిర్మాణ విలువులతో వెండితెర కోసం మలిచారు. గతంలో సిరీస్‌లో మరణించినట్లు చూపించిన మున్నా భయ్యా (దివ్యేందు) పాత్ర ఈ చిత్రంలో మళ్లీ రీఎంట్రీ ఇస్తుండటం అభిమానులకు అసలైన విందుగా మారనుంది. ఇక మిర్జాపూర్ సింహాసనం కోసం జరిగే పోరులో కాలీన్ భయ్యా (పంకజ్ త్రిపాఠి), గుడ్డూ పండిట్ (అలీ ఫజల్) మరియు మున్నా భయ్యా మధ్య జరిగే రక్తపాతంతో కూడిన పోరాటం ట్రైలర్‌లో ప్రధాన ఆకర్షణగా నిలిచింది. ఈ చిత్రంలో పంకజ్ త్రిపాఠి, అలీ ఫజల్, దివ్యేందులతో పాటు శ్వేతా త్రిపాఠి, రసికా దుగ్గల్, అభిషేక్ బెనర్జీ, జితేంద్ర కుమార్, రవి కిషన్ మరియు పలువురు ప్రముఖ నటీనటులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు.




Printed, Published and Owned by SITARALLA SRIRAMULU and Printed at M/s SRI DIVYA PRINTERS, Plot No. 33 & 34, 2nd Floor, Vasthu Colony, LB Nagar, Ranga Reddy, Telangana - 500074 and Published at H.No. 10-1-101/10. Bhagya Nagar Colony, Lingojiguda, Saroornagar, Ranga Reddy, Telangana - 500035. EDITOR: SITARALLA SRIRAMULU , RNI. No. TELTEL/2015/62524. Cell: 9966443465